సూర్య
www.suryaa.com
ఆదివారం
12.1.2025

# జీవిత పాఠాలు నేర్పే గాలిపటాలు





నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

## చైర్మన్‌తో ముఖాముఖి

**రోజుకు ఎనిమిది గంటలు.. వారానికి ఆరు రోజుల పని భారత దేశంలో ప్రామాణిక సమయం. ఓ మనిషి శారీరకంగా, మానసికంగా పని చేయడానికి.. తర్వాత కుటుంబానికి , విశ్రాంతికి సమయం కేటాయించడానికి ఇంత కన్నా ఎక్కువ పని చేయడం శ్రేయస్కరం కాదని నిర్ధారించారు. ప్రపంచంలో చాలా దేశాలు.. రోజుకు తొమ్మిది గంటలు వారానికి ఐదు రోజులు పని పద్ధతిని పాటిస్తున్నాయి. టెక్ ప్రపంచం విస్తరించిన తర్వాత భారత్ లోనూ ఆ విధానం పెరుగుతోంది. ఇప్పటికే పని గంటలతో పని లేకుండా పని చేయించుకుంటున్నారని.. చాలా కంపెనీలపై ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కార్పొరేట్ బాసులు.. అసలు కుటుంబాలు ఎందుకు పని చేస్తేచాలు కదా అంటున్నారు. కాస్త వివరించండి**

– కె. లలిత, కాకినాడ

ఇన్ఫోసిస్ ఫౌండర్ నారాయణమూర్తి కొన్నాళ్ల కిందట యువత వారానికి 70 గంటలు పని చేయాలని సలహాిచ్చారు. అంటే విశ్రాంతి తీసుకోకుండా వారానికి ఏడు రోజులు రోజుకు పది గంటలు పని చేయాలి. ఒక రోజు సెలవు తీసుకోవాలనుకుంటే.. ఆరు రోజుల పాటు రోజుకు పదకొండున్నర గంటలు పని చేయాలని చేయాలని చెప్పుకొచ్చారు. నారాయణమూర్తికి వయసు పెరిగిపోయిందని చాదస్తంగా మాట్లాడుతున్నారని చాలా మంది లైట్ తీసుకున్నారు. అయితే ఆయన మాత్రం తన విధానాన్ని మార్చుకునేది లేదన్నారు. తాజాగా నారాయణమూర్తి కంటే ఎక్కువగా వారానికి 90 గంటలు పని చేయాలని.. ఇంట్లో బార్యముఖాలు ఎంత సేపు చూస్తారని ఎల్ అండ్ టీ చైర్మన్ వాక్రూచ్చారు. ఆయన మాటల్ని ఎల్ అండ్ టీకూడా సమర్థించుకుంది. కొంత మంది వీరి మాటలకు మద్దతుగా మాట్లాడుతున్నారు. కానీ చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. రోజుకు ఇరవై నాలు గంటలు అంటే.. ఏడు రోజులకు 168 గంటలు. ఇందులో 90 గంటల పాటు పని చేస్తే ఇక మిగిలేది 78 గంటలు. ఓ మనిషికి కనీసం ఆరేడు గంటల నిద్ర చాలా అవసరమని వైద్యులు ప్రకటించారు. లేకపోతే ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. అంటే కనీసం యభై గంటలు నిద్రకు తీసేయాలి. ఇక మిగిలే 28 గంటల్లో కాలకృత్యాలు తీర్చుకోవడానికి, తినడానికి స్నానం చేయడానికి.. రోజుకు కనీసం గంట పాటు కేటాయించుకున్నా.. ఇక మిగిలేది ఇరవై గంటలు. ఇందులోనే వ్యక్తిగత పనులు.. కుటుంబ అవసరాలు.. అన్నీ చూసుకోవాలి. అంటే రోజుకు మూడు గంటలు మాత్రమే ఉంటుంది. కాస్త రిలాక్స్ అయ్యేందుకు ఒక్క సినిమా చూసేందుకు కూడా టైమ్ ఉండదన్నమాట. ఉదయం ఆరు గంటలకు లాగిన్ అయితే..రాత్రి ఏడు గంటల వరకూ పని చేయాలని చెబుతున్నారు. అది కూడా ఏడు రోజులు. ఇంత కన్నా బానిసత్వం ఏమీ ఉండదని ఎవరైనా అనిపిస్తుంది. ఇప్పటికే దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా యువతలో మానసికపరమైన సమస్యలు పెరుగుతున్నాయి. అంత కంటే మించి కెరీర్ తో పాటు కుటుంబానికి.. జీవితాన్ని ఆస్వాదించడానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సొంత కంపెనీలు పెట్టుకున్నా సరే పర్సనల్ లైఫ్ కు ప్రాధాన్యం ఇస్తున్నారు. అదే సమయంలో టెక్ కంపెనీల్లో పెరుగుతున్న ఒత్తిడి కారణం.. ఉద్యోగుల ఔట్ పుట్ తగ్గిపోతోందని.. వారికి తగినంత విశ్రాంతి ఇవ్వాలన్న రిపోర్టులు వెలుగులోకి వస్తున్నాయి. ఇలా దేశ యు వతను వారానికి 90 గంటలు పని చేయించుకుంటే.. ఇండియా ఉత్పాదకత పెరగ దని..మ్యాన్ పవర్ మొత్తం నిర్వీర్యం అయిపోతుందని అంటున్నారు. నారాయణమూర్తి ప్రారం భించిన డిబేట్ ను సుబ్రహ్మణ్యన్ పీక్ కు తీసుకెళ్లారు. ఇప్పుడు డిబేట్ విపరీతంగా జరుగు తుంది. చివరికి ఏమైనా మార్పులు జరుగుతాయా లేదా అన్ని వేచి చూడాల్సి ఉంది.


**ఉదయం పది దాటుతున్న ఢిల్లీలో సూర్యుడి జాడే కనిపించడం లేదు. వెలుతురుగా ఉన్నా ఎదుట మనిషి కనిపించడం లేదు. దీనికి కారణం విపరీతమైన పొగమంచు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నీరు. మీరేమంటారు.**

– అంపిలి విజయకుమార్, హైదరాబాద్

ఢిల్లీలో ప్రతి సంవత్సరం శీతాకాలం వచ్చిందంటే చాలు చలిగా విపరీతంగా ఉంటుంది. ఈ ఏడాది కూడ ఇక్కడ ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతున్నట్లు అధికారులు తెలిపారు. సూర్యుడు రానా వద్దా అంటూ అలా కనిపిస్తున్నాడు. అయినప్పటికీ రోజంతా బాగా చలిగానే ఉంటోంది. దానికి తోడు ఉదయాల్లో పొగమంచు వల్ల ఎదురుగా ఏమి ఉంటుందో కనిపించడం లేదు. ఢిల్లీలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో అధికారులు ఈరోజు 12 విమానాలను రద్దు చేశారు. మరో 100 ఫ్లైట్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. 123 విమానాలు సగటున అరగంట పాటు ఆలస్యంగా నడుస్తున్నాయి. పొగమంచు కారణంగా శుక్రవారం ఒక్కరోజే సుమారు 6 విమానాలు రద్దు అయ్యాయి. 100 ఫ్లైట్స్ ఆలస్యంగా నడిచాయి. ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో జీరో విజిబిలిటీ ఉండడమే దీనికి కారణం అని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే నిన్నటి కంటే ఈరోజు పరిస్థితి కాస్త మెరుగ్గా ఉంది. విజిబిలిటీ కాస్త బెటర్గా ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీనికి తోడు ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. మరో పక్క రైళ్ళు కూడా ఆలస్యంగా నడుస్తున్నాయి. మంచు కారణంగా ఢిల్లీ వెళ్లే దాదాపు 50 కి పైగా రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. అలాగే ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్, కర్నాల్ గాజియాబాద్ ప్రాంతాల్లో ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి కంటిన్యూ అవుతోంది.
దీంతో చాలాచోట్ల ట్రాఫిక్ సమస్య తలెత్తింది. ఇప్పటికే వాతావరణ శాఖ ఢిల్లీకి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. జనవరి 8 వ తేదీ వరకు దేశ రాజధానిలో పొగ మంచు ఇలానే ఉండే అవకాశాలున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది.

# విజనరీ ఫిల్మ్ మేకర్ మేధావి శ్యామ్ బెనగళ్

## లెజెండ్



సమాంతర సినిమాకు నిజమైన మార్గదర్శకుడు,ఆలోచింపజేసే కథ,కథనాలు, సామాజిక సమస్యలతో సినిమాల ద్వారా చిత్ర పరిశ్రమపై తనదైన ముద్ర వేసిన శ్యామ్ బెనగళ్ గారి మరణంతో భారతీయ సినిమా,టెలివిజన్ రంగాల లో ని ఓ సువర్ణాధ్యాయం ముగిసిపోయింది.ముఖ్యంగా సినిమాయే శ్వాస, నిశ్వాసగా జీవించిన ఈ శ్యామ్ బెనగళ్ గారి సినిమా ప్రయాణం చాలా అద్భుతం గా సాగింది అని నిస్సందేహంగా చెప్పవచ్చు.ఒక విధంగా సామాజిక అంశాలపై అంకితభావంతో ఆయన చేసిన సినిమాలు భావితరాలకు సైతం ఒక గొప్ప ప్రేరణగా నిలుస్తాయి అనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు.అంతేకాదు భారతీయ సినిమా భాషా బేధాలు లేకుండా కమర్షియల్ సిని మాల ప్రవాహానికి కొట్టుకుపోతున్న రోజుల్లో ఆ ప్రవాహానికి ఎదురీదిన వాడు,సమాంతర (పారలల్ ) సినిమాకి ఊపిరిపోసిన వాడు ఈ శ్యామ్ బెనగళ్ గారు.ఈయన అసలు పేరు బెనగళ్ల శ్యామ్ సుందరరావు,సికింద్రాబాద్ లో డిసెంబర్ 14,1934న జన్మించారు,ఇక ఆ మహానుభావుడు సరిగ్గా 90 సంవత్సరాల 9 రోజులు ఈ భూమి మీద బతికారు అన్న మాట.ఇక తెలంగాణ విషయానికి వస్తే ఆయనకి ఊహ తెలిసేటప్పటికి ఆ ప్రాంతం అంతా ఇంకా నిజాం పాలనలోనే ఉండేది.అప్పటి దొరల దౌర్జన్యాలు,అట్టడుగు ప్రజల పట్ల పెత్తందారీతనాలు,ముఖ్యంగా మహిళల కన్నీటి కథలు,శ్యామ్ బెనగళ్ గారి గుండెలపై చెరగని జ్ఞాపకాలు అయ్యాయి.ఇక వాటిని ఆధారంగా చేసుకొనే తన సినిమాల్లో శక్తివంతమైనా మహిళ పాత్రలకు రూపకల్పన చేశాడు శ్యామ్ బెనగళ్ గారు.అందులో భాగంగా ' అంకుర్ ' ( 1974) తో మొదలెట్టి ' జుబేదా ' ( 2001) వరకు దాదాపుగా ప్రతి సినిమాలో మహిళ పాత్రలకు చైతన్యాన్ని, శక్తిని ఇచ్చిన ఎవర్ గ్రీన్ దర్శకుడు ఈ శ్యామ్ బెనగళ్ గారు.అలాగే సినిమా ఖచ్చితంగా సామాజిక మాద్యమం,అది ఈ సమాజాన్ని పట్టించుకోవాల్సిందే అని చాలా బలంగా విశ్వసించే ఈ శ్యామ్ బెనగళ్ గారు భూస్వాముల దోపిడి ఇతి వృత్తంగా ఆయన తీసిన చిత్రం ' అంకుర్ ' హైదరాబాద్ లో 100 రోజులు ఆడటం,అదే సినిమాకు కొనసాగింపుగా ' నిషాంత్ ' తీయడం,ఇక చిన్న మనుషులు ఒక్కటైతే సహకార వ్యవస్థ ద్వారా ఎలా స్వయం సంవృద్ధి సాధించవచ్చో చూపుతూ ' మంథన్ ' అనే సినిమా తీయడం,దాని నిర్మాణానికి పాడి రైతులు తలా రెండు రూపాయల వాటా వేయడం నభూతో న భవిష్యత్ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఇక ఆయన ఎల్లవేళలా దేశం కోసం దేశ వాసుల కోసం పనిచేస్తూనే వెళ్లడం, తద్వారా ఎన్నో డాకుమెంటరీలు సైతం ఆయన తీశారు.వాటిలో నెహ్రూ ' డిస్కవరీ ఆఫ్ ఇండియా ' ను,' భారత్ ఏక్ భోజ్ ' పేరుతో ఇచ్చిన దృశ్య కావ్యం కష్టతరమైనది.ఇక ఆ దృశ్య రూపానికి దురదర్శన్ లో అప్పట్లో విపరీతమైన ఫాలోయింగ్ ఉండటం ఓ కోసమెరుపు.అలాగే సత్య జిత్ రే మీద ఆయన తీసిన డాకుమెంటరీ అతి ముఖ్యమైనది.అదే సమయంలో సుభాష్ చంద్రబోస్ మీద పరిశోధన చేసి ' నేతాజీ సుభాష్ చంద్రబోస్ ' తీశాడు.ఇక ' మేకింగ్ ఆఫ్ మహాత్మా ' కు సైతం దర్శకత్వం వహించిన ఘన,గొప్ప చరిత్ర కూడా ఈ శ్యామ్ బెనగళ్ గారిదే.

ఏదిఏమైన ముస్లిం మహిళల జీవితాలను ఆధారంగా చేసుకొని సైతం శ్యామ్ బెనగళ్ గారు ' మమ్ము, సర్దారీ బేగమ్, జుబేదా ' సినిమాలు నిర్మించారు. ఇక మహా భారతాన్ని బిజినెస్ సామ్రాజ్యానికి అన్వాయిస్తూ శశికపూర్ తీయించిన ' కలియుగ్ ' సైతం శ్యామ్ బెనగళ్ గారి ప్రయోగమే.అంతేకాదు అనంత్ నాగ్,షబానా ఆజ్మీ,నసీరుద్దీన్ షా, ఓంపూరి,స్మితా పాటిల్,అమ్రేష్ పూరి లాంటి గొప్ప,ఉద్ద%శీ%డ నటుల్ని సైతం కనుగొన్న కొలంబస్ ఈ శ్యామ్ బెనగళ్ గారు.ఏమైనా శ్యామ్ బెనగళ్ గారి అమోఘమైన ప్రతిభకు మెచ్చి భారతీయ ప్రభుత్వం వారు ఆయనకు 8 జాతీయ చలన చిత్ర అవార్డులు ప్రదానం చేశారు.అందులో భాగంగా ' అంకుర్ ' ( 1975),'నిషాంత్ '( 1976),'మంథన్ ' ( 1977),' భూమిక ది రోల్ ' (1978), ' జునూన్ ' ( 1979),ఆరోహణ్ ( 1982), ' నేతాజీ సుభాష్ చంద్రబోస్ ' ( ( 2005),' వెల్ డన్ అబ్బా ' ( 2009).అలాగే సినీ రంగంలో కనబరచిన అత్యుత్తమ ప్రతిభకు గాను 1976 లో పద్మశ్రీ,1991లో పద్మభూషణ్, 2009 లో ఇందిరా గాంధీ జాతీయ సమైక్యత పురస్కారం,2013 లో ఏఎన్ఆర్ జాతీయ అవార్డులు అందుకున్నారు ఈ ప్రతిభాశాలి శ్యామ్ బెనగళ్ గారు. అంతకు మించి 2005 సంవత్సరానికి గాను 2007 ఆగస్టు 8 న అత్యంత ప్రతిష్టాత్మకమైన ' దాదా సాహెబ్ పాల్కె ', తెలుగు సినిమా ' అనుగ్రహం ' కు నంది అందుకున్నారు ఈ అల్ టైం గ్రేట్ దర్శకులు శ్యామ్ బెనగళ్ గారు.అన్నింటికి మించి మన దేశంలోనే అత్యుత్తమ ఫిల్మ్ మేకర్,మేధావి అయిన శ్యామ్ బెనగళ్ గారు దివికేగిన ఈ విషాద సమయాన్ని పురస్కరించుకొని కోట్లాది భారతీయ సినిమా అభిమానులం మనమంతా ఆ నిలువెత్తు శిఖరానికి చాలా ఘనంగా, గొప్పగా నివాళులు అర్పిద్దాం! అమర్ రహే అమర్ రహే శ్యామ్ బెనగళ్ గారు.

**– బుగ్గన మధుసూదనరెడ్డి, 9000369660**

## నవ కవిత్వం

### మారవా! మనిషివి కావా !!



నువ్వా... నేనూ... వేరై ఉండొచ్చు
నాలో దాగున్నది నువ్వేనని
నీలో నిండి ఉన్నది నేనేనని
ఎలా చెప్పాలి నీకు ?
చుట్టూ నిశిని చూస్తూ
ఇంకెన్నాళ్ళు కాలం గడిపేస్తావ్
మదిలో కదలికలు లేకుండా
ఇంకెన్నాళ్ళు
శిధిలావస్థలో నిలుచుండిపోతావ్?
మారవా....! మనిషివి కావా.....!!
కర్కోటపు ఆలోచలనడుమన
కత్తిగాట్లు వేసుకుంటూ...
మూర ంగా వ్యక్తిత్వపు
పునాదులకు
చెదలు పడుతుంటే ఇంకా ఏం
చూసుకొని నీకంత అహం
ఆరోగ్యం కోల్పోయి, వయసును
కోల్పోయి
చితికి దగ్గరయ్యాక ఏం
చేద్దామని..!!
అప్పుడెంత వెతికిన శూన్యంలో
రాతలు తప్ప ఏముంటుంది??
గతితప్పిన గాలిపటంలా
ఇంకెన్నాళ్ళు బ్రతుకుతావ్?
బాధ్యతలు లేవు బంధాలు లేవు
కన్నవారు లేరు
కావలసినవారు లేరు
నీ కోసం ఏడ్చే
నలుగురు మిత్రులు లేరు
ఏం సాధించావని! నీకంత
అహంకారం??
రా......! కాసేపలా కూర్చుని
మనసిప్పి మాట్లాడుకుందాం
అహాన్ని అలా పక్కకు నెట్టి
ప్రేమను గుండెల నిండుగా
నింపుకుని ముచ్చటించుకుందాం..

**వాసి జ్యోత్స్న**
**9866843005**

## లేఖలు




**ముఖచిత్ర కథనం ఫాతిమా షేక్ గురించి ప్రత్యేక వ్యాసం ప్రచురించడం హర్షణీయం. ఆదివారం అనుబంధంలో ప్రచురించిన వ్యాసం చాలా విశేషాలన** అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నా ము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్థవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరం దిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## పల్లె పడతి-పండ్ల బ్యారం



గత కాలపు గాయాలను
గంప కింద చుట్ట కుదురు చేసి
భర్త బతుకు భారాన్ని సగం
దించడానికి
పండ్ల గంపను నెత్తికెత్తిన పల్లె పడతి


పరికిపొదల పానాదులపొంటి
కాశగంటలల్ల కాలినడకన
పొట్టాపతికి గంప బ్యారానికై
పండ్ల వేటకు అడవుల్ల
తిరుగుతుంటది


వానల్ల అల్లనేరళ్లు చలికాలపు
రేగుపళ్లు
మంట రేపే ఎండల్ల మామిడిపళ్లు
కాలాలవారీగా కమ్మని పండ్లను
అమ్మకానికై వాడకట్లలో
తిరుగుతుంటది

పండ్లే అమ్ముతవ ? అని
పల్లికలించేటోళ్లు
ఎంతకెంతకిస్తవని ?
ఎటకారమాడేటోళ్లు
ఏంఏం అమ్ముతావని ? అడిగే
ఆకతాయిలు
ఎకిలి పలుకులు ముల్లులై
కుచ్చుతుంటే
పల్లేరు కాయల్లో తిరుగుతున్నట్టుంటది

మాటల కోతల మనసు గాయాలకు
మౌనాన్నే మందుగా రాస్తూ
ఆత్మగౌరవానికి ఆకలిని బలి చేసి
ఖాళీ కడుపుతో కాళికలా
తిరుగుతుంటది

**డా.ఎడ్ల కల్లేశ్**
**9866765126**










సూర్య

బాలల కథ

# బుడత



# మూఢ నమ్మకం



‘ విశాలీ, మా  అక్కయ్యకు సీమంతం జరుపాలని బామ్మ పట్టు పట్టడం వల్ల జరుపుతున్నారు. ఫారిన్ లో వున్న మా వదిన ఇలాంటి మూఢనమ్మకం నుంచి తప్పించుకొంది. మా వదిన కూడా గర్భవతి .అక్కడే డెలివరీ చూసుకొంటానంది. బామ్మను చూస్తే నాకు చాలాకోపంగా వుంది. అంతా పిచ్చి మూఢనమ్మకం.” పదవ తరగతి చదువుతున్న అమృత కోపంగా  అంది.

“అమృతా, వయసుమళ్ళిన మీ బామ్మ అడిగిందని చేస్తున్నారను కొంటున్నాను. “

“ఇప్పటికే ఇంటినిండా అప్పులు న్న సంగతి తెలిసీ సీమంతముకు బంధువులను  పిలిపించాలని బామ్మ పట్టుబట్టింది . “

“ బంధువులంటే ఇంట్లో చోటు చలదుగా , ఏదైనా హొటలునందు అంటే మరీ ఖర్చు అవుతుంది .”

“ఆ ఒక్క విషయంలో నాన్న వ్యతిరేకించారు. ఇంట్లోనే తక్కువ మంది బంధువులను పిలిచి చేద్దామన్నారు.”

“ సీమంతమే వద్దంటూ మా ఇంటిలో నేను తప్ప ఎవరూ వ్యతిరేకించలేదు “

“ అమృతా, మీ ఇంట్లో నీవే చిన్నపిల్లవు. అందుకే నీ మాటలు పట్టించుకొనివుండరు. రేపు నీ  పెళ్ళైన  తరువాత నీవు సీమంతం లాంటి వేడుక జరిపించవద్దు. ఇంతకూ మీ వదినకు ఈ సంగతి తెలుసా “

“ఈ రోజు  ఇంటికెళ్ళాక వాట్స్ అప్ లో మావదినకు ఫోన్ చేస్తాను “

ఇంటికెళ్ళాక  వదినకు ఫోన్ చేసి  అన్ని సంగతులు వివరించి చెప్పింది

“నేనే మీ అక్కయ్యకు  సీమంతం  జరిపించమని చెప్పాలనుకున్నాను.”

“ వదినా ,మూఢనమ్మకమైన ఆ సీమంతం ఎంధుకు జరపాలి ‘  “మూఢనమ్మకమని ఎవరు చెప్పారు శాస్త్రీయంగా అందులో ఒక మంచి వుంది .నిన్ననే నాకూ సీమంతం జరిగింది “

“వదినా చదువుకొన్న నాస్తికురాలివి నీవు ..నీవు “

“ ఇప్పటికీ నేను నాస్తికురాలినే, దేవుడు లేదంటూ వదిస్తాను .కానీ  కొన్నింటిని  మూఢనమ్మకాలుగా తీసుకోకుండా ఆలోచిస్తే ఒక ప్రయోజనం ఉంటుంది “

“సీమంతం వలన ప్రయోజనం ఏమిటి “

“సీమంతం వలన గలగలమనే గాజుల శబ్దానికి  కడుపులో బిడ్డ క్షేమముగా పెరుగుతుందని  చెబుతారు. నేను ఇక్కడ జరుపుకున్న సీమంతం వేరేపద్ధతిలో జరుపుకొన్నాను. .”

“ సీమంతం వేరే పద్ధతిలోనా అంటే”


“ ఇక్కడ గర్భిణీ స్త్రీలు డాల్ఫిన్ థెరఫీ కి వెళ్తారు. అది సీమంతం లాంటి ప్రయోజనం కలిగినది. చాలా ఖరీదవుతుంది.వంద మైళ్ళ దూరానున్న అక్కడకు మీ అన్నయ్య నన్ను తీసుకెళ్లారు “


“వదినా వివరంగా చెప్పు”

“ డాల్ఫిన్ థెరఫీ అంటే గర్భవతి స్త్రీ కడుపు దగ్గర  డాల్ఫిన్ శబ్దం చేసేలా చేస్తారు ,ఆ శబ్దం వలన కడుపులో బిడ్డ ఉత్సాహంతో, క్షేమముగా పెరుగుతుందని  చెబుతారు.  ఇక్కడ ఈ థెరఫీకి అన్ని మతాల వారు వస్తున్నారు. ఆ డాల్ఫిన్ చేసే శబ్దం రికార్డు చేస్తే ఒక్కొక్క సారి అది గాజుల శబ్దం లాగుంటుందని చెప్పారు .అంటే వాళ్ళు  ఇప్పుడు కనిపెట్టింది  మనవాళ్ళు ఎప్పుడో సీమంతం పెరుమీద గర్భిణీ స్త్రీకి గాజులు తొడుగుతున్నారు


“వదినా, ప్రతిదీ మూఢనమ్మకమని  నిర్లక్ష పరచకూడదు. కొన్ని మూఢనమ్మకాల వెనుక దాగివున్న నిజాన్ని గుర్తించాలని తెలుసుకున్నాను” అంది అమృత

**ఓట్ర ప్రకాష్ రావు  09787446026**







12.1.2025 సూర్య ఆదివారం

## ఈవారం కథ

# పెద్ద పండుగ

బుడ్డా గాడు పొద్దు పొద్దున్నే నిక్కరేసుకొని ఎగురు కుంటా ఇంట్లో నుంచి వస్తున్నాడు.జేబు నిండుగా, ఉబ్బుకొని ఉంది.

"ఏరా...యాడికి అట్లా దూకుతాండావే , జేబులో ఎందో పెట్టుకొండావే ? పొదున్నే తినేదానికా?" అంటూ దుముకుతూ పోతున్న బుడ్డా గాడి చొక్కా కాలర్ వెనక నుంచి పట్టుకున్నాడు పెద్దయ్య.

ఒక్కసారిగా డీజలు బండికి బ్రేక్ కొట్టినట్లు ఆగి ఆయనకేసి చూశాడు బుడ్డ.

బుడ్డా అంటే పిల్లోడు లావుగా ఉంటాడు అనుకునేరు. పుట్టినప్పుడు ఆ ఊర్లో అందరికన్నా బొద్దుగా ఉన్నది వాడు ఒక్కడే అందుకే అందరూ అప్పటి నుండి అసలు పేరుతో పిలవడం మానేసి ఈ పేరు పెట్టుకున్నారు ముద్దుగా.

"తాత పండగొస్తాంది కదా, చలిమంట వేసుకోవద్దు అందుకే చిదుగు తెచ్చుకొనేదానికి పోతాండా " అన్నాడు.

"అంత చిదుగు నీ కేందుకు రా , దో ఆ పక్క పెద్దన్నోళ్ళు యేసేకాడ కాచుకోవచ్చు కదా ?" అన్నాడు చొక్కా వదలకుండా

చొక్కాను విడిపించుకోవడానికి ప్రయత్నం చేస్తూ "తాత మాకీతూరి దండిగా కావాలి పండక్కు మా చిన్నాన్నోళ్ళు వస్తాన్నారు"అన్నాడు కాస్త కళ్ళు పెద్దవి చేసి.

"ఒరినీ... పాసుగుల అందుకేనా అట్లా గెంతుతాండవ్..పో"అని పంజరంలో ఉన్న పావురాన్ని వదిలినట్లు వదిలాడు. అంతే రివ్వున ఎగిరి పోయాడు బుడ్డోడు.

*******

పండక్కు అందరూ ఒక చోటికి చేరారు. పిల్లలు కునల్లా మారిపోయారు.పెద్దలు పిల్లలై పోయారు.

చాలా రోజుల తర్వాత అన్న దమ్ములిద్దరు ఒకే చోట కూర్చున్నారు వాళ్ళ దగ్గరకు పిల్లలు తప్పున వచ్చి వాలిపోయారు.



"నాన్న మీరు చిన్నప్పుడు పండగ ఎలా చేసుకొనే వారు ?" అని అడిగాడు పిల్లోడు.

"పండగ... ఆ పదం కోసం ఎదురు చూసే వాళ్ళం, అమ్మ వద్దన్నా కంప కొట్టుకొని వచ్చి మంట వేసేటోల్లం,

మా చిన్నప్పుడు ఒక్కరోజే భోగి కాదు. చలికాలం వచ్చిందంటే చాలు పొద్దున్నే మళ్ళకు నీళ్ళు కట్టెటోల్లు, పాలు పితికి డైరీకి వేసేటోల్లు అందరూ మంట కాడికి ప్రతి రోజూ చేరిపోతారు. ఒకసారి కాచుకొందే వెళ్ళరు.

ఇక మా ఊర్లో సంక్రాంతి పండగ అంటే ప్రతి ఇంట్లో దోసెలు, పితుకు (అనపగింజలు నానబెట్టి తోలు తీసి)పప్పు కూర ఉంటాయి.అందరూ అత్తిరేశాలు చేసుకుంటాం.ఇక కనుమ రోజైతే అలసంద వడలు ఉండాల్సిందే, ఒక్కొక్కరు ఒక్కో వాయి తినాల్సిందే.."

అంటూ నవ్వు కున్నారు.

"నాన్న మీరేమి ఆడుకోరా ?" అన్నాడు ఇంకో పిల్లోడు.

"ఆటలంటే మీ మాదిరి రోజూ ఆడే ఆటలు కాదు పడగల్లో ఆడేవి, మేము కొన్ని ఆడితే , పెద్దోళ్ళు ఆడే ఆటలు కొన్ని చూసేట్లొల్లం.

టెంకాయలు రోట్లో వేయడం, అగ్గిపెట్టేలాట, తాడు లాగుడు అబ్బో ఇలా ఒకటా రెండా అన్ని ఆటలు వదలకుండా ఆడేటోల్లం, చూసేటోల్లం " అన్నారు ఇద్దరు.

"నాన్న మరి కనుమ పండుగ రోజు పశువులను ఎందుకు అలా చిట్లా కుప్ప చుట్టూ తిప్పుతారు? వాటికి సెగ తగలదా?" అన్నాడు బుడ్డోడు.

"చిట్లా కుప్ప అంటే?" అన్నాడు తమ్ముడు.

"చిట్లా కుప్ప అంటే మన ఊరి చివర పోతురాజు గుడికాడ ఒక్కపొద్దు ఉండి, నైవేద్యం పెట్టి గుడి ముందర పెద్ద మంట వేసి దాని చుట్టూ పశువులను అలంకరించి సంబరంగా , ఉత్సాహంగా ఉండేందుకు తిప్పుతామే కానీ వాటిని ఎవరూ, ఎప్పుడూ హింస పెట్టారు... పెట్టకూడదు , అవి లేక పోతే మనకు తిండి లేదు "అంటూ ఇద్దరు గొడ్ల కొట్టం వైపుకు చూసారు.

*******

ఇంతలో ఇద్దరికీ అమ్మ గుర్తొచ్చింది చిన్నప్పుడు సంక్రాంతి పండగ అంటే పెద్దల పండగ అని చెప్పేది చనిపోయిన వాళ్ళ పెద్దలను గుర్తుకు చేసుకుంటూ వాళ్లకు బట్టలు పెట్టి వాళ్ళ జ్ఞాపకాలను నెరవేసుకుంటూ గడిపే వాళ్ళు ఎన్నోసార్లు వాళ్ల నాన్నను కూడా మరవకుండా తలుచుకున్నారు. ఇద్దరు అన్నదమ్ము లు ఇప్పుడు కూడా వాళ్ళు పాతకాలపు పండగ వాతావరణాన్ని అనుభవించడానికి ఇక్కడికి చేరుకున్నారు. నిజంగా పల్లెల్లో పండగ మనసుకు , మనసుకు మధ్య కలిసిపోయే విధంగా ఉంటుంది . అందుకే కాబోలు ఏ పండగ ఎలా చేసుకున్నా సంక్రాంతి పండగ అంటే పట్నంలో ఉండే ప్రతి ఒక్కరూ పల్లెల వైపు చూస్తూ తమ ప్రయాణాన్ని ఎన్ని కష్టాలు ఎదురైనా అక్కడే చేసుకుని సంవత్సరానికి ఒక్కసారి అయినా కాస్త తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకోవాలి అని చూస్తుంటారు. మనం కూడా ఈసారి సంక్రాంతి పండగను బాగా జరుపుకుందాం అనుకుంటూ అందరూ కలిసి రాత్రి ఒకే చెట్టు కింద కూర్చొని ఆరు బయట భోంచేస్తూ , పిల్లల్లోని ఆనందాన్ని తనివి తీర ఆస్వాదిస్తూ పెద్ద పండుగను పెద్ద మనసుతో జరుపుకున్నారు.

**సింగంపల్లి శేష సాయి కుమార్**
**8639635907**

# అరుగు బడి



రాజు అరుగు బడి లో రెండేళ్లు చదువుకుని కాన్వెంట్ బడిలో మూడవ తరగతి లో చేరాడు.అక్కడి విద్యార్థులకు అరుగు బడి విద్యార్థులు అంటే చిన్న చూపు.అరుగు బడిలో చదువుకున్న విద్య కు గుర్తింపు ఉండదని కాన్వెంట్ బడి ఉపాధ్యాయులు చెబుతారు. అరుగు బడిలో విద్యా బోధన విచిత్రంగా ఉంటుంది. సమయ వేళలు ఉండవు. కాళు ్ళ చేతులు సరిగా పని చేయని రాములు సారు అరుగు మీద కూర్చుని పాఠాలు బోధిస్తారు. అరుగు బడి విద్యార్థులు తెలుగు పద్యాలు బాగా పాడుతారు. లెక్కలు బాగా చేస్తారు. పౌరాణిక, పంచతంత్ర,జానపద కథలు వినసొంపుగా చెబుతారు.రాజు చదువులో చురుకుగా ఉండడం కొందరు పిల్లలకు అసూయ కలిగింది. రాజు ను ఎగతాళి చేస్తూ ఆట పట్టించారు. అతనితో ఆటలు ఆడేవారు కాదు.ఉపాధ్యాయుల ప్రశ్నలకు జవాబులు చెప్పడానికి రాజు లేచి నిలబడితే నెక్కరు పట్టి కిందకు లాగేవారు.రాజు ను చదవకుండా చేయడానికి రకరకాల ప్రయత్నాలు చేసారు.

రాజు కు వారిపై చాలా కోపం వచ్చింది.ఉపాధ్యాయులకు చెబితే ఏమి చేస్తారోనని భయపడి మౌనం వహించాడు. నెలలు గడిచాయి.రాజు చదువుపై ఎక్కువ శ్రద్ధ పెట్టాడు.వారి చేష్టలను పట్టించుకోలేదు.పరీక్షలు బాగా వ్రాసాడు.తరగతి లోనే కాదు, పాఠశాల లోనే ప్రథమ స్థానం సంపాదించాడు.ఉపాధ్యాయుల దృష్టిని ఆకర్షించాడు. ప్రధానోపాధ్యాయునికి ప్రియ శిష్యుడయ్యాడు.అరుగు బడి గౌరవాన్ని నిలబెట్టాడు. ఎగతాళి చేసిన తోటి విద్యార్థుల్ని మిత్రులుగా మార్చుకున్నాడు.

**దుర్గమ్ భైతి**
**:9959007914**

# బ్యాచ్లర్ స్టైల్ బోండాల రెసిపీ

అప్పుడప్పుడు అనుకోకుండా చేసిన వంటలే మంచి రుచిని ఇస్తాయి. కొన్నిసార్లు మనమేనా ఇది చేసింది అని కూడా అనిపించవచ్చు. అలా అనుకునే కొత్తగా ఏదైనా చేద్దామని ఓ రూమ్లోని బ్యాచ్లర్స్ బోండాలు తయారు చేశారు. దానికి తోడుగా పల్లీ చట్నీ కూడా చేసుకున్నారు. కట్ చేస్తే.. ప్రొఫెషనల్ చెఫ్ కూడా పనికిరాడు అనే రేంజ్లో వంటని చేశారు. ఎంత మంచిగా వంట చేసేవారికైనా బోండాలు చేసేప్పుడు అవి పగిలిపోవడం, పిండి కుదరకపోవడం జరుగుతాయి. కానీ వారు చేసిన బోండాలు చూస్తే.. ఓడియమ్మ ఏమి చేశారు అనకుండా ఉండలేరు. ఇంతకీ వారు బోండాలు ఎలా చేశారు.. చట్నీ ఇలా కూడా చేస్తారా అనిపించే రెసిపీ ఇక్కడుంది. చూసేయండి.



**కావాల్సిన పదార్థాలు**

నూనె - 2 టేబుల్ స్పూన్లు

వాము - కొంచెం

పెరుగు - మూడూ టేబుల్ స్పూన్లు

సాల్ట్ - రుచికి తగినంత

మైదా పిండి

నూనె - డీప్ ఫ్రైకి సరిపడా

**తయారీ విధానం**

ముందుగా ఓ గిన్నె తీసుకోవాలి. దానిలో నూనె, వాము, పెరుగు, సాల్ట్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు మైదా పిండి వేసుకుని.. పిండిని బోండాలు వేసేందుకు వీలుగా కలుపుకోవాలి. పిండి ఉండలు లేకుండా బాగా కలుపుకోవాలి.

ఇప్పుడు స్టౌవ్ వెలిగించి దానిపై డీప్ ఫ్రైకి సరిపడా నూనె వేసి.. కాగనివ్వాలి. నూనె వేడి అయిన తర్వాత పిండిని మరోసారి కలిపి.. బోండాలుగా వేసుకోవాలి. గోల్డెన్ బ్రౌన్ కలర్ వచ్చేవరకు వేయించుకుంటే సరిపోతుంది.

**పల్లీ చట్నీ కోసం..**

పచ్చిమిర్చి, పల్లీలను పాన్లో ఫ్రై చేసుకోవాలి. దానిలో ఓ 5 వెల్లుల్లి రెబ్బలు వేసుకోవాలి. అవి కూడా వేగిన తర్వాత పక్కన పెట్టుకోవాలి. వీటిని మిక్సీలో వేసి గ్రైండ్ చేసుకోవచ్చు. కానీ మిక్సీలేని బ్యాచ్లర్స్ ఏమి చేశారంటే.. పల్లీల మిశ్రమాన్ని గిన్నెలో వేసి.. దానిని బ్లెండర్తో మిక్స్ చేశారు. నీళ్లు పోస్తూ.. బ్లెండర్తో దానిని చట్నీగా మార్చుకున్నారు. ఇప్పుడు స్టౌపై మరో గిన్నె పెట్టి దానిలో నూనె వేసి జీలకర్ర, ఎండుమిర్చిని వేయించుకుని.. దానినే తాళింపుగా చట్నీలోకి వేసేశారు.

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



(గతవారం తరువాయి).

గంగ నిద్ర లేచి తల్లి పడుకున్న చోటుకు వెళ్లింది.

పాపులమ్మ నోటి నుండి బురుగు లాంటిది ఏదో వచ్చింది. శరీరం మీద చీర కొంగు సరిగా లేదు. గౌరీ పాలు తాగుతోంది కానీ పాపులమ్మ లోకాన్ని విడిచి వెళ్లిపోయింది. పాపులమ్మ బాలింత జాడ్యంతో చనిపోయిందని ఫకీరప్ప తేల్చాడు.

గంగ.. పాపులమ్మ శవం దగ్గరి నుండి గౌరీని తీసుకుంది. గౌరీ ఆకలికి ఏడ్చింది. అంతలో పల్లె మొత్తం పరుగులు తీసింది. గంగకు ఎంత కష్టం వచ్చిందని బాధపడ్డారు. పిల్లలను అనాధలను చేసి పాయెనని ఏడ్చారు. ఆదెన్నను ఖననం చేసి రెండు రోజులు కాకముందే పాపులమ్మ కూడా మ-రణించడం పల్లెను మొత్తం ఆశ్చర్యానికి గురి చేసింది. గంగ మీద జాలిపడ్డారు, మేము ఉన్నామని దళితులు భరోసా ఇచ్చారు.

తల్లిదండ్రులను కోల్పోయిన తర్వాత ఎవరున్నా, ఎంతమంది ఉన్నా తల్లిదండ్రుల లోటును పూడ్చడం ఎవరితరం అవ్వదనే సత్యం అందరికీ తెలిసిందే.

సుబ్బక్క ముఖం మీద నీళ్లు చల్లారు, బిడ్డ శవం మీద పడి తల బాదుకుంది. నువ్వే ఇలా అయిపోతే పిల్లలను ఎవరు సముదాయిస్తారని ఎవరో అన్నారు. ఎవరెన్ని చెప్పినా సుబ్బక్కను సమాలించడానికి అవ్వలేదు.

పాపులమ్మ శవాన్ని శవాల దిన్నెకు తీసుకువెళ్తున్న సమయంలో అందరూ తమ ఇళ్ళ ముందు పసుపు నీళ్లు చల్లుకున్నారు. శవాన్ని తీసుకువెళ్తున్న సమయంలో గుడిసెల నుండి ఎవరూ బయటకు రాలేదు. బాలింత శవాన్ని చూస్తే దరిద్రం పట్టుకుంటుందని మూఢనమ్మకం, పిచ్చితనం.

పాపులమ్మ అధ్యాయం ముగిసింది. తన మానాన్ని కాపాడుకోడానికి ఎన్నో అవమానాలు భరించింది కానీ మగ వెధవలకు లొంగలేదు. ఆదెన్నను తన సర్వస్వంగా భావించింది, చివరకు తను కూడా మోసం చేశాడు. పాపులమ్మ ఎలాంటిదో అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాడు. కష్టాలు వచ్చినప్పుడు ముందుకు సాగకుండా ఆత్మహత్య చేసుకొని భార్యాపిల్లలను అనాధలను చేశాడు. తన అవమానం గురించే ఆలోచించాడు కానీ భార్య గురించి కానీ, పిల్లల గురించి కానీ ఆలోచించలేకపోయాడు.

పల్లె మొత్తం పాపులమ్మను నిందిస్తున్నప్పుడు ఆదెన్న దగ్గరకి తీసుకొని అర్థం చేసుకొని ఉంటే, మానసికంగా ధైర్యం చెప్పి ఉంటే, పాపులమ్మ మీద అనుమానాన్ని పెంచుకోకపోయుంటే గంగ, గౌరీ, నారాయణ అనాధలు అయ్యేవారు కాదు.

అమాయకత్వం, చేతకానితనం, చైతన్యం లేకపోవడం, నిరక్ష్యరాస్యత, బీదరికం ప్రశ్నించకుండా చేస్తాయి. కులవ్యవస్థ, దేవుడు, మూఢనమ్మకాలు, మతిలేని ఆచారాలు, సంస్కృతీ, సంప్రదాయం పేరుతో జరిగే పనులు ప్రజలను వెనక్కి తీసుకువెళ్తాయి.

@@@

అన్న, వదిన చనిపోయారనే విషయం పులివెందులకు పది కిలోమీటర్ల దూరంలో గొల్లపల్లి తాండలో ఉన్న గంగులుకు తెలియగానే వేములకు చేరుకున్నాడు. గంగ, గౌరీ, నారాయణను ప్రేమగా దగ్గరికి తీసుకున్నాడు. ఇంటిని వదిలి వెళ్లి తప్పు చేశానని ఏడ్చాడు. తను వేములలోనే ఉండి ఉంటే అన్నా, వదినలు చనిపోయి ఉండేవారు కాదని కుమిలిపోయాడు.

'ఇన్ని రోజులు ఏమైపోయావు? ఎక్కడికి వెళ్లావు? నా బిడ్డ, అల్లుడు మనల్ని వదిలి వెళ్లిపోయారని' గంగులును పట్టుకొని సుబ్బక్క ఏడ్చింది.

భర్త తిరిగి వచ్చిన విషయం తెలిసి అచ్చుక్క, అచ్చుక్క తల్లిదండ్రులు వేములకు చేరుకున్నారు. గంగులును గట్టిగా హత్తుకొని అచ్చుక్క బోరున ఏడ్చింది.

'నా బిడ్డను మోసం చేయడానికి నీకు మనసు ఎలా వచ్చింది? చేసుకున్న పాపం ఊరికే పోతుందా? అందుకే ఇలా జరిగిందని' అచ్చుక్క తల్లి వదిరింది.

'నేను చేసింది తప్పే, ఇంకెప్పుడు ఇలా చేయను, భార్యను బాగా చూసుకుంటానని మాటిచ్చాడు.'

'నిన్ను నమ్మి మా బిడ్డను ఈ పాడు కొంపలో వదిలి వెళ్లే ప్రసక్తే లేదు. నువ్వే మా పల్లెకు రావాలి, లేదంటే అచ్చుక్కకు మరో పెళ్లి చేస్తాము. నువ్వు ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లావు? మరో పెళ్లి చేసుకున్నావా?' అనుమానంగా అడిగింది.

'ఇప్పుడు నేనేమి చెప్పలేను, పిల్లలను వదిలి ఎక్కడికీ వచ్చేది లేదు. నేను ఎక్కడుంటే అచ్చుక్క అక్కడే ఉంటుంది' అచ్చుక్క వైపు బాధగా చూశాడు.

'ఇన్ని రోజులు నీ పక్కనే ఎందుకు పెట్టుకోలేదో! నా బిడ్డను వదిలి వెళ్ళిపోయావని అందరూ నానామాటలు అంటుంటే.. నా బిడ్డ ఎంత బాధపడిందో ఈ తల్లికే తెలుస్తుంది. నీ మానానికి నువ్వు వెళ్ళిపోయావు, నిన్ను నమ్మి నా బిడ్డను నీకు అప్పచెప్పలేను.'

'ఇంకెప్పుడు అలా చేయను, ఈ ఒక్కసారి క్షమించమని అత్తమామల కాళ్ల మీద పడ్డాడు.'

గంగులు మాములుగా అలా చేయడు, గంగులు ప్రవర్తనలో మార్పు వచ్చిందని, గంగులు పిల్లలతో ఉండటమే న్యాయమని అచ్చుక్క తల్లిదండ్రులు భావించారు. పైగా అచ్చుక్క, గంగులుకు పిల్లలు లేరు కాబట్టి గంగ, గౌరీ, నారాయణను చూసుకుంటూ జీవితాన్ని గడుపుతారులే అనుకొని అచ్చుక్కను వేములలో వదిలేసి వెళ్లిపోయారు.

@@@

అచ్చుక్క, పాపులమ్మ మరణంతో పల్లెలో సద్దిబట్టలు ఎవరితో ఉతికించుకోవాలో అర్థంకాలేదు. పక్క పల్లె నుండి వేరే చాకలి వాళ్లు కొందరి బట్టలు ఉతుకుతున్నారు కానీ పల్లె ప్రజల బట్టలు ఉతకడానికి చాకలి కుటుంబం తప్పనిసరి.

అచ్చుక్క, గంగులు, గంగను పల్లె పెద్దలు పిలిపించి సద్దిబట్టలు ఎప్పటి నుండి ఉతుకుతారని? బిచ్చం అడిగేది ఎవరని అడిగారు.

గంగకు ఎక్కడ లేని కోపం వచ్చింది. బట్టలు ఎందుకు ఊరికే ఉతకాలని ప్రశ్నించింది. పంచాయితీకి ఎదురుచెప్పడంతో పల్లె పెద్దలు తట్టుకోలేకపోయారు.

'నీ అమ్మ పల్లె ప్రజల బట్టలు పోగొట్టింది, అందుకుగాను శిక్ష పడింది. శిక్షను మీరు అనుభవించాల్సిందేనని' ఖరాఖండీగా చెప్పారు.

మీ అందరి బట్టలను ఉతకడానికి మా అమ్మానాన్నలు వంకగడ్డకు వెళ్లారు. ఆ క్రమంలో గంగాదేవి పల్లె చెరువు వర్షాలకు నిండి కట్ట తెగింది. నీళ్లు వస్తున్నాయని ఎవరికీ తెలియదు, అకస్మాత్తుగా నీళ్లు రావడంతో బట్టలతో పాటు మావి నాలుగు గాడిదలు కూడా కొట్టుకుపోయాయి. మీ బట్టలు పోగొట్టామని మాకు శిక్ష వేశారు. మీ బట్టలు ఉతకడానికి వెళ్ళినప్పుడే కదా మా గాడిదలు కూడా కొట్టుకుపోయింది. కాబట్టి మీరందరూ కలిసి మాకు నాలుగు గాడిదలను కొనియాలి.

అది మాత్రమే కాకుండా మీ బట్టల విలువ కంటే ఎక్కువగానే మేము మీ అందరి సద్దిబట్టలు ఉతికాము. మీ బట్టలు పోయాయని మాతో ఉచితంగా బట్టలు ఉతికించుకోవడమే కాకుండా, మా అమ్మానాన్నను బిచ్చం ఎత్తుకునేలా చేశారు. మా గాడిదల సంగతి తేల్చండి అంటూ సూటిగా అడిగింది.

'గాడిదలు కొట్టుకుపోతే పల్లె ఎందుకు బాధ్యత వహిస్తుంది? బట్టలతో పాటు గాడిదలను మీరే కాపుడుకోవాలి.'

'మీ బట్టలు కొట్టుకుపోతే మేము బాధ్యత వహించాలి, బిచ్చం ఎత్తుకోవాలి, ఉచితంగా మీ సద్దిబట్టలు ఉతకాలా? మీరు మాత్రం మా గాడిదలు కొట్టుకుపోతే బాధ్యత వహించరా? మా అమ్మా నాన్న బట్టలను కావాలని పోగొట్టలేదు. అయినా చాలా సంవత్సరాల పాటు మీ అందరి బట్టలు ఉతికారు కనుక ఇక నుండి ఊరికే బట్టలను ఉతికే ప్రసక్తే లేదు. ఎవరైనా డబ్బు ఇచ్చి బట్టలు ఉతికించుకోవాల్సిందే.'

పల్లె పెద్దలను ఎదురించి మాట్లాడటం, ఇచ్చిన తీర్పే తప్పని చెప్పడంతో గంగులు, అచ్చుక్క, గంగ దగ్గర ఎవరూ బట్టలు ఉతికించుకోకూడదని, కొన్ని రోజుల్లో పల్లెకు కొత్త చాకలిని ఏర్పాటు చేస్తామని పల్లె ప్రజలకు పంచాయితీ పెద్దలు తెలియజేశారు. దాంతో వేముల ప్రజలు గంగ వాళ్లకు బట్టలు ఇవ్వడం మానేశారు.

గంగ భలే మాట్లాడిందని దళితలు, తక్కువ కులస్తులు మెచ్చుకున్నారు. గంగ ప్రశ్నలకు సమాధానం లేకపోవడంతోనే బట్టలు వేయకూడదని తీర్పు ఇచ్చారు. గంగ మాట్లాడుతుంటే తలలు ఎక్కడ పెట్టుకొవాలో తెలియక పంచాయితీ పెద్దలు ఉక్కిరిబిక్కిరి అయ్యారని దళితులు మాట్లాడుకున్నారు.

'చాకలి దానికేమి అంత హెూలిగ' అంటూ బ్రాహ్మణ కుటుంబాలు పెదవి విరిచాయి. గంగ మీద కోపం పెంచుకున్నారు, పంచాయితీ పెద్దలు ఆవేశంతో రగిలిపోయారు. ఇంకాస్త ఉంటే గుండెలు పగిలి చచ్చేవారు, పోయినా ఒక పనైపోయేది.

***

కొండారెడ్డి వేములకు వెళ్లాడు కానీ జరిగిన విషయాల గురించి ఎవరితోనూ మాట్లాడలేదు, పల్లెలో కొండారెడ్డిని ఎవరు అడగనూ లేదు. గంగ పంచాయితీనీ ఎదిరించిందని తెలిసి దడుసుకున్నాడు. కొన్ని రోజులు గంగ జోలికి వెళ్లకపోతే నయమనుకున్నాడు. పైగా మరికొన్ని రోజుల్లో సర్పంచ్ ఎన్నికలు ఉండటంతో.. ఆ హడావిడిలో తలమునకలయ్యాడు. పల్లెలో ప్రతి గుడిసెకు తిరిగుతూ ఓట్లు అడిగాడు, ఈసారి గెలిస్తే పల్లెలో శివాలయం కట్టిస్తానని ఆడవాళ్లకు, పల్లె చివర సారాకొట్టు పెట్టిస్తానని మగవాళ్లకు హామీ ఇచ్చాడు.

వేముల పల్లెలో సారాకొట్టు లేదు, పులివెందులకు, వేంపల్లికి పనిమీద వెళ్లినప్పుడు మగాళ్లు సారా తెచ్చుకుంటారు. పెద్దకోటయ్య కొన్ని రోజుల పాటు కల్తీ సారా అమ్మడానికి ప్రయత్నించాడు కానీ పోలీసుల బెడద వల్ల మానేశాడు. వేములలో రామాలయం ఎవరు కట్టించారో కానీ చాలా సంవత్సరాల నుండి ఉంది. పురాతనమైన ఆలయం కావడంతో పక్క పల్లెల వాళ్లు కూడా ఆలయానికి వెళ్తారు. రాయలయం పక్కనే శివాలయం కూడా కడతానని హామీ ఇవ్వడంతో పల్లెలో చాలామంది సంబరపడ్డారు. శివరాత్రి వస్తే పులివెందులకు వెళ్లాల్సి వస్తోంది. పల్లెలో శివాలయం కడితే భక్తిలో మునిగి తేలచ్చు అనుకున్నారు.

ఎన్నికల సమయంలో తప్పా ఎప్పుడూ అగ్ర కులాలవాళ్లు దళిత వీధుల్లోకి వెళ్ళరు. కొండారెడ్డి దళిత వీధిలోకి వెళ్ళాడు.

'బాపనోళ్ళ, మిట్ట మీద ఉన్న ఇళ్ల ముందు కుళాయిలు ఉన్నాయి కానీ దళిత వీధిలో కుళాయి ఎందుకు లేదని' ఎవరో చంప చెల్లుమనేలా అడిగారు.

కొండారెడ్డి నీళ్లు నమిలి 'నిధులు మంజూరయ్యాయి, ఈసారి గెలిపిస్తే తప్పకుండా మీ వీధిలో కుళాయిలు వస్తాయి. అదే గంగప్పన్న గెలిస్తే మీ బతుకులు మారవు, ఆయన నోరు లేని మనిషి కావడంతో పార్టీ వాళ్లను అడగలేడు. నేనైతే కొట్లాడైనా మీ వీధికి కొళాయి వచ్చేలా చూస్తానన్నాడు.'

గంగప్పన్న మాజీ సర్పంచ్ మాత్రమే కాదు చాలా మంచి మనిషి కూడా.

గత పదేళ్లుగా సారా పంచుతూ, ఏవేవో హామీలిస్తూ, ఓటుకు డబ్బు పంచుతూ కొండారెడ్డి గెలిచాడు. ఈ సారి గంగ కుటుంబంపై జరిగిన పరిణామాలు, పదేళ్ల నుండి ఎలాంటి మార్పు లేకపోవడంతో దళితులు కొండారెడ్డిని నమ్మలేదు.

దళిత వీధిలో అడుగడుగునా సమస్యలే. వేముల మొత్తం వంద గడపలు ఉంటే దళితులు, బీసీలు ఎక్కువగా ఉన్నారు. అయినా ఒక్కసారి కూడా దళితులు, బీసీలు ఎన్నికల్లో నిలబడలేదు. కొండారెడ్డి, గంగప్పన్న (పూర్తి పేరు గంగా మనోహర్ రెడ్డి అయితే తన మంచితనం కారణంగా అందరూ గంగప్పన్న అంటారు) రెడ్లు మాత్రమే వేములను శాశిస్తున్నారు.

ఆ విషయంపై దళితులు, బీసీలు ఆలోచించలేదు. ఎన్నికల్లో నిలబడాలి అనుకోలేదు. వేములలో వాళ్ల వోట్లు ఎక్కువగా ఉన్నాయి, అందరూ ఒక తాటిపైకి వస్తే తమలో నుండే సర్పంచ్ ని ఎన్నుకోవచ్చనే ఆలోచన లేకుండా చేసింది సమాజం.

అందరి గుడిసెల దగ్గరికి వెళ్లాల్సిందే కాబట్టి గంగ ఇంటి ముందుకు కూడా వెళ్లాడు. గంగతో ఏం మాట్లాడుతాడోనని దళితులు చాలామంది కొండారెడ్డిని అనుసరించారు.

'ఊరిలో లేని సమయంలో ఆదెన్న, పాపులమ్మ ఇద్దరూ పైకి పాయేనే, పైగా పంచాయితీ పెద్దలు నీకు పని ఇవ్వకుండా చేశారని మనవాళ్లు చెపితే విన్నాను. ఈసారి నాకు ఓటు వేసి గెలిపిస్తే వేములలో బట్టలు ఉతికే పని నీకే వచ్చేలా చేస్తానన్నాడు.'

'వేముల పల్లెలో బట్టలు ఉతకడానికి మాకు తప్ప మరెవరికి అధికారం ఉంటుంది? మమ్మల్ని కాదని ఏ చాకలివాడు వేములలో అడుగు పెడతాడో చూస్తాను. గుడికి ఒకే పూజారి, పల్లెకు ఒకే సర్పంచ్ ఉన్నప్పుడు మమ్మల్ని కాదని వేరే పల్లె నుండి చాకలి వాడిని ఎలా తెస్తారో చూస్తాను.'

'పదేళ్ల పాటు సర్పంచ్ గా ఉండి దళిత వీధుల్లో రోడ్లు ఎందుకు వేయించలేకపోయారు, నీటి కుళాయిలు ఎందుకు రాలేదు, బాపనోళ్ళకు, రెడ్లకు, మీ బంధు బలగాలకు మాత్రమే పక్కా ఇల్లు వచ్చాయి? మాకెందుకు రాలేదు? దళితుల, బీదల గుడిసెలు మాత్రం అలానే ఉన్నాయి, మీ ఇళ్లు మాత్రం పెద్దగయ్యాయి. ఆ తేడా ఎలా వచ్చింది?'

'నేను గెలిస్తే అది చేస్తాను, ఇది చేస్తాను అంటున్నారు. బాగానే ఉంది కానీ గత పదేళ్ల నుండి ఎందుకు చేయలేకపోయారు? మిమ్మల్ని చేయకుండా ఆపింది ఎవరు? ప్రభుత్వం నుండి పల్లెకు వచ్చిన నిధులు ఏమయ్యాయి?' గంగ ప్రశ్నల వర్షం కురిపించింది.

కొండారెడ్డి దగ్గర ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం లేదు. 'నువ్వు ఒక్క దానివి నాకు వోటు వేయకపోతే నాకొచ్చే నష్టమేమీ లేదులే' పొగరుగా, కోపంగా, ఆవేశంగా.

గంగ తల పైకి ఎత్తింది, చుట్టూ చూసింది. గంగ చుట్టూ దళితులు గుమ్మిగూడారు, గంగది ఒక్క ఓటే అనుకోవడం కొండారెడ్డి మూర త్వం. నిజానికి కొండారెడ్డి గుడిసెల దగ్గరికి ఓట్లు అడుగటానికి వస్తున్నాడని రెండు రోజుల ముందే దళితులకు తెలుసు.

(మిగతా వచ్చేవారం)



జాని తక్కెడశిల
7259511956



# జీవిత పాఠాలు నేర్పే గాలిపటాలు

**సూర్య భగవానుని గొప్పదనాన్ని గుర్తుచేసుకునే పండుగే మకరసంక్రాంతి. ఈ రోజున స్నానం చేసి, సూర్యభగవానుని పూజించి, దానాలు చేస్తారు. మకర సంక్రాంతి పండుగను మన దేశంలో చాలా పేర్లతో పిలుస్తారు. తమిళనాడులో పొంగల్, గుజరాత్లో ఉత్తరాయణం, పంజాబ్లో లోహ్రి, అస్సాంలో భోగాలి, బెంగాల్లో గంగాసాగర్, ఉత్తరప్రదేశ్లో ఖిచ్డీ, తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి అని పిలుస్తారు. ఇక సంక్రాంతికి గాలిపటాలు ఎగురవేయడం అనేది సంప్రదాయంగా వస్తుంది. పతంగులు ఎగురేయడం వెనక ఉన్న కారణాలు ఏంటి? ఇందుక్కు సంబంధించిన వివరాలలోకి వెళితే....**

రెండు తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి అంటే..ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల కోసం ఎక్కడెక్కడో ఉన్నవారంతా కూడా సొంతూర్లకు చేరుకుంటుంటారు. సంక్రాంతి అంటేనే ఎన్నో సరదాలు తెచ్చిపెడుతుంది. గుమ్మాలు నిండా రంగవల్లులు, వాకిట్లో రంగురంగుల ముగ్గులు, హరిదాసులు, గంగిరెద్దులు, పిండి వంటలు, కోడి పందేలు ,గాలి పటాల పోటీలు అన్ని కలిపి సందడి సందడిగా ఉంటుంది. సంక్రాంతి అంటే ఊరూవాడా అంతా పండగలానే ఉంటుంది. ఈ సంక్రాంతికి చిన్నపెద్ద అనే తేడా లేకుండా ప్రతిఒక్కరూ గాలిపటాలు ఎగరేస్తూ ఉంటారు. పెద్దలు కూడా చిన్న పిల్లల మాదిరిగా అయిపోయి పంతంగులను ఎగరేస్తారు. అసలు సంక్రాంతికి గాలి పటాలు ఎందుకు ఎగరేస్తారు? దాని వెనక ఉన్న అసలు కథ ఏంటి అనేది చాలా మందికి తెలియదు.

ఆకాశంలో తేలుతుంది మేఘం కాదు. తోకాడిస్తుంది పిట్టకాదు. పట్టు తప్పితే పారిపోతుంది. ఇంతకీ అదేంటో చెబుతారా? అంటే ఠక్కున గుర్తొచ్చే సమాధానం గాలిపటం . సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు నెల ముందు నుంచే ఆకాశంలో గాలిపటాలు కనువిందు చేస్తుంటాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అంతా సరదాగా గాలిపటాలు ఎగరవేస్తూ ఆనందిస్తుంటారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో పోటాపోటీగా గాలిపటాలు ఎగరేస్తూ సందడి చేస్తుంటారు. రకరకాల ఆకారాల్లో పతంగులు నింగిని తాకుతూ అలరిస్తుంటాయి.



రైతులు పండించిన పంట ఇంటికి వచ్చే సమయంలో సంక్రాంతి పండగ జరుగుతుంది. శ్రేయస్సుకు ప్రతీకగా పండుగను చేస్తారు. ఉత్తరాయణ కాలం మకర సంక్రాంతి. ఈ పండుగ చాలా ఉత్సాహంగా నిర్వహిస్తారు. దక్షిణ భారతదేశంలో అత్యంత వైభవంగా జరుపుకొంటారు. పూజలు చేస్తారు. ఎద్దులకు స్నానాలు చేయించి.. కొమ్ములకు నూనె రాస్తారు. వాటిని కూడా దైవంగా భావిస్తారు. ఇంటి తలుపులను పైరుతో అలంకరించి లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే దేవతలు ఆరు నెలల తరువాత సంక్రాంతికి నిద్ర నుంచి లేస్తారట. వారికి స్వాగతం పలికేందుకు ఆకాశంలో గాలిపటాలను ఎగరేస్తారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే పురాణాల ప్రకారం శ్రీరాముడు.. హనుమంతుడితో పాటు తన తమ్ముడు లక్ష్మణుడు, ఇతరులతో కలిసి సంక్రాంతి రోజున గాలిపటం ఎగరేశారని, అప్పటి నుంచి సంక్రాంతికి గాలిపటం ఎగరేసే సంప్రదాయం వచ్చిందని పురాణాలు అంటున్నాయి.

## సూర్యుడికి అంకితం చేస్తూ

సంక్రాంతికి పంతంగులు ఎగరేయడానికి అనేక కారణాలు ఉన్నాయి. సాధారణంగా సంక్రాంతి చలికాలంలో వస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. సంక్రాంతి రోజున సూర్యుడు దక్షిణాయన కాలం నుంచి ఉత్తరాయణ కాలంలోకి ప్రవేశిస్తాడనే విషయం తెలిసిందే. అందుకే సూర్యుడికి అంకితం చేస్తూ గాలిపటాన్ని ఎగరేస్తారు. అలాగే చలికాలం పూర్తయి వసంతంలోకి అడుగుపెడుతున్నామని చెప్పడానికి ఈ పంతంగులను ఎగరేస్తారని పెద్దలు కథలు కథలుగా చెబుతుంటారు.

ఆచారానికి ఒక ప్రత్యేక నమ్మకం

కొన్ని చోట్ల రన్నింగ్ కాంపిటీషన్, రెజ్లింగ్, మహిళలతో జానపద నృత్యం, గాలిపటాలు ఎగురవేయడం, ఇతర ఆచారాలు ఉంటాయి. ప్రతి ఆచారానికి ఒక ప్రత్యేక నమ్మకం, చరిత్ర ఉంటుంది. కొత్త బట్టలు కట్టుకుని ఇంటింటికీ నువ్వుల బెల్లం పంచి అందరి నోళ్లు తీపి చేస్తారు. పిల్లలు, పెద్దలు కలిసి గాలిపటాలు ఎగురవేస్తారు. అయితే ఇలా గాలిపటాలు ఎగురేసేందుకు కారణాలేంటి అని ఎప్పుడైనా ఆలోచించారా?

**(మిగతా 8వ పేజీలో)**

( 7వ పేజీ తరువాయి)



రంగురంగుల గాలిపటాలు ఆకాశంలో ఎగురవేయడం సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేకం. అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్ కూడా జరుపుతుంటారు. యసూర్య భగవానుని పూజించే ఈ పండుగ ప్రారంభం వసంత ఆగమనాన్ని సూచిస్తుంది. విభిన్న సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో కూడిన ఈ పవిత్ర పండుగ ప్రతి ఒక్కరి మనసులోనూ, ఇంట్లోనూ కొత్తదనాన్ని నింపుతుంది. ఈ సమయంలో ఎగిరేసే గాలిపటాలకు ప్రత్యేకత ఉంది.

**ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు**

మకర సంక్రాంతి పండుగ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆకాశంలో రంగురంగుల గాలిపటాలు ఎగురుతాయి. సాధారణంగా చలికాలంలో చాలా క్రిములు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల చాలా జబ్బులు, జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయి. అందువలన మకర సంక్రాంతి సమయంలో ప్రకాశవంతమైన సూర్యకిరణాలు పొందడం ద్వారా బ్యాక్టీరియా సహజంగా నాశనం అవుతుంది. అందుకే గాలిపటాలు ఎగురవేస్తారు. సూర్యుడి కిరణాలు నేరుగా మన శరీరం మీద పడతాయి. ఈ రోజున శరీరం మీద సూర్య కిరణాలు పడటం అమృతం లాంటివని అంటారు. వివిధ వ్యాధులను నయం చేసే శక్తి ఉంది.

ఈ గాలిపటాలు ఎగురవేయడం వెనక మరో కథ కూడా ప్రచారంలో ఉంది. మకర సంక్రాంతి, ఉత్తరాయణ సమయంలో గాలిపటాలు ఎగరేస్తే స్వర్గానికి వెళ్తారని నమ్మకం ఉంది. మంచి జీవితాన్ని, సంతోషాన్ని ఇచ్చినందుకు భగవంతుడికి కృతజ్ఞతలు తెలిపేందుకు గాలిపటం ఎగురవేస్తారట. అలాగే ఉత్తరాయణ సమయంలో నీలాకాశంలో గాలిపటం ఎగరేయడం వలన మనసకు హాయిగా ఉంటుందని కొందరు చెబుతారు.

**గాలిపటం గత చరిత్ర :**

గాలిపటాలు ఎగరేయడం ఇప్పటిది కాదు. క్రీస్తు పూర్వం 2వేల ఏళ్ల కిందట చైనాలో మొదలైంది. ప్రసిద్ధ చైనీస్ తత్వవేత్త మోజీ మొదట ఈ గాలిపటాన్ని పట్టు వస్త్రంతో తయారు చేశారు. ఆ తర్వాత హేన్ చక్రవర్తి శత్రువు కోటలోకి సొరంగాన్ని తవ్వాలనే ఆలోచనతో గాలిపటం తయారుచేసి దారం కట్టి ఎగరవేశాడు. ఆ దారాన్ని కొలిచి సొరంగం తవ్వి, సైనికులను పంపి కోటను వశం చేసుకున్నాడనే కథ ప్రచారంలో ఉంది. కాలక్రమంలో గాలి పటాలు విదేశాల్లోనూ ఎగరడం మొదలుపెట్టాయి. మన దేశంలోనూ ఎగరవేయడం ప్రారంభించారు. ముందు సన్నని వస్త్రంతో, ఆ తర్వాత కాగితంతో గాలిపటాలను తయారు చేయడం మొదలుపెట్టారు.



నిజాం నవాబులు కూడా గాలిపటాలు ఎగరవేయడాన్ని బాగా ప్రోత్సహించారు. పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడంతో అవి మన సంస్కృతిలో భాగంగా మారాయి.

**అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్**

గాలి పటాలంటే అన్ని దేశాల ప్రజలకు ఆసక్తే. పోటీలు పెట్టుకొని మరీ పతంగుల్ని ఆకాశపుటంచుల్ని తాకేలా చేస్తారు. గుజరాత్లోని సబర్మతీ నదీ ) తీరంలో జరిగే అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్కు లక్షల మంది హాజరవుతారు. విదేశాల నుంచి వచ్చి పోటీపడుతుంటారు. గాలిపటం ఎగరవేయడం అందరి వల్ల కాదు. నేర్పు, నైపుణ్యం ఉంటే తప్ప గాలిపటం నింగిలోకి పంపించలేము. గాలి వేగం, గాలిపటాన్ని తయారు చేసే పదార్థం, హ్యాండర్ల నైపుణ్యంపై ఆధారపడి పతంగి పైకి ఎగురుతుంది.

**జీవిత పాఠాలను నేర్పుతున్న గాలిపటం :**

ఆకాశంలో పక్షిలా విహరించే గాలిపటం మనకు ఎన్నో జీవిత పాఠాలను నేర్పిస్తుంది. మన లక్ష్యం ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని అప్పుడే పైకి ఎదగడం సాధ్యమవుతుందని చెబుతుంది. గాలిపటం ఎగరేస్తున్నప్పుడు ఎలాగైతే పట్టు బిగిస్తామో మన జీవితంపై కూడా అలాగే పట్టు బిగించి ముందుకుసాగాలి. దిశను, వేగాన్ని నియంత్రించుకోవాలి. మరీ బిగబట్టినా లేదా అలా వదిలేసినా గాలిపటం కింద పడ్డట్లే జీవితం కూలిపోతుంది. ఆకాశంలో స్వేచ్ఛగా ఎగురుతున్న పతంగికి గాలి, చెట్లు, వేరే గాలిపటాలతో అనేక సమస్యలు వస్తుంటాయి. శ్రద్ధ పెట్టి సమస్యలను అధిగమించడానికి ప్రయత్నించాలి. అన్నింటిని భరిస్తూ ఎదగడానికి ప్రయత్నించాలని చెబుతుంది గాలిపటం.



# అత్యంత పురాతన లగ్జరీ సింగిల్ మాల్టు, క్రేజీ కాక్ రేర్ మరియు దువా

ఈ లగ్జరీ సింగిల్ మాల్టు భారతదేశంలోని అతిపెద్ద మెచ్యూరేషన్ వేర్హౌస్ లో తయారయ్యాయి మరియు సౌత్ సీస్ డిస్టిలరీస్ ద్వారా భారతదేశంలోని అతిపెద్ద రాగి పాట్ స్టిల్స్లో డిస్టిల్డ్ చేయబడ్డాయి. భారతదేశంలోని అత్యంత పురాతన మాల్ట్ డిస్టిలరీ మరియు దేశంలోని అతిపెద్ద మెచ్యూరేషన్ వేర్హౌస్ కి నిలయంగా భాసిల్లుతున్న సౌత్ సీస్ డిస్టిలరీస్, భారతదేశపు అరుదైన విస్కీలు – క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ విస్కీలను విడుదల చేస్తున్నట్లు వెల్లడిం చింది. ఇవి రెండు అద్భుతమైన రూపాలు , రేర్ మరియు దువా గా లభించను న్నాయి, క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ విస్కీలు ఇప్పుడు మహారాష్ట్ర, గోవా మరియు హర్యానాలోని ప్రముఖ రిటైల్ అవుట్లెట్లలో అందుబాటులో ఉ న్నాయి. ఇవి ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగళూరు, గోవా మరియు చండీగఢ్లోని డ్యూటీ ఫ్రీ అవుట్లెట్లతో పాటు అంతర్జాతీయంగా యూఏఈ లో కూడా అందుబాటులో ఉన్నాయి. నాలుగు దశాబ్దాల మాల్ట్ నైపుణ్యంతో రూపొందించబడిన ఈ విస్కీ లు, భారతదేశంలోని అత్యంత పురాతన లగ్జరీ సింగిల్ మాబీల్టు. చాలా పరిమిత పరిమాణంలో విడుదల చేయబడిన ఈ విస్కీలు మహారాష్ట్రలోని దహానులో సౌత్ సీస్ డిస్టిలరీస్ యొక్క అత్యాధునిక సౌకర్యాలలో పరిపక్వం చేయబడ్డాయి. భారతదేశంలోని ప్రత్యేకమైన వాతావరణంకు తగినట్లుగా, ఉష్ణమండల పరిపక్వతలో ప్రావీణ్యం సంపాదించిన డిస్టిలరీ, క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ వంటి విస్కీలను అందిస్తుంది, ఇది చల్లని ప్రాంతాల నుండి తీర్చిదిద్దిన 25 ఏళ్ల మాల్టుతో పోల్చదగిన రీతిలో ఉంటుంది. ఈ సింగిల్ మాల్టు భారతదేశ వాతావరణంలో ఓక్ పీపా ప్రవర్తనపై డిస్టిలరీ యొక్క లోతైన అవగాహనను ప్రతిబింబిస్తాయి, ప్రతి సిప్కి ఒక ప్రత్యేక లక్షణాన్ని అందిస్తాయి.

**సింగిల్ మాల్ట్ మేకింగ్ యొక్క కళ**

నాలుగు దశాబ్దాల మాల్ట్ అనుభవంతో, సౌత్ సీస్ డిస్టిలరీస్ భారతదేశపు మాల్ట్ విస్కీ వారసత్వానికి మూలస్తంభంగా నిలిచింది, ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ల కోసం ప్రపంచ స్థాయి మాల్టును ఇది రూపొందించింది. క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ వారి స్వంత లగ్జరీ వినియోగదారు బ్రాండ్ను ఆవిష్కరించడానికి వారి సాహసోపేత మార్పును సూచిస్తుంది. వ్యవస్థాపకుని అభిరుచి మరియు స్థిరత్వం తో కూడిన ఈ ప్రయత్నం, వ్యాపారంగా కాకుండా ఒక కళారూపంగా సింగిల్ మాల్ట్ తయారీని ప్రదర్శిస్తుంది. క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ విస్కీల తయారీలో ప్రతి దశలోనూ శ్రేష్ఠతను సౌత్ సీస్ ప్రదర్శించింది – ఐకానిక్ కాపర్ పాట్ స్టిల్స్లో వీటిని రెండుసార్లు డిస్టిల్ చేయడం నుండి ఈ కాపర్ పాట్ స్టిల్స్, ప్రీమియం లేబుల్ల ఆకారంతో స్ఫూర్తిని పొంది, చక్కగా రూపొందించిన బాటిల్ డిజైన్ వరకు ఇది కనిపిస్తుంది , మరియు అరుదైన ఫ్లోర్-గ్రేడ్ కార్కు ఇక్కడ వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 1% కంటే తక్కువ కార్క్ చేసిన ఉత్పత్తులలో ఫ్లోర్-గ్రేడ్ కార్కు ఉ




పయోగించబడుతున్నాయి.

**వారసత్వం తో కూడిన పేరు**

ఈ పేరు వ్యవస్థాపకుడి దృష్టికి ఒక నివాళి: "క్రేజీ" అనేది భారతదేశంలో సింగిల్ మాల్టు వాస్తవంగా తెలియని సమయంలో ప్రపంచ స్థాయి డిస్టిలరీకి మార్గదర్శకత్వం వహించడానికి అతనిని ప్రేరేపించిన అభిరుచి మరియు మొండితనానికి ప్రతీక. కోడి పుంజు యొక్క కూత , లేదా "కాక్", కొత్త రోజును సూచిస్తున్నట్లే, అతిపెద్ద భారతీయ మరియు ప్రపంచ బ్రాండ్లకు మద్దతు ఇవ్వడమే కాకుండా క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ విస్కీల ప్రారంభం సౌత్ సీస్కు, దాని స్వంత ఒరిజినల్ బాట్లింగ్ను కూడా విడుదల చేయడానికి కొత్త శకాన్ని సూచిస్తుంది.

క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ రేర్ అనేది డబుల్ ఓక్ బారెల్స్లో నిల్వ చేయబడిన అపూర్వమైన శైలి , ఇది గొప్ప కాషాయం మరియు వెల్వెట్ ఫినిషింగ్ను అందిస్తుంది. క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ దువా, హిందీలో పొగ అని అర్థం, ఇది స్మోకీ అండర్ టోన్లు మరియు సంక్లిష్టమైన ప్రొఫైల్తో కూడిన విస్కీ .

సౌత్ సీస్ డిస్టిలరీస్ డైరెక్టర్ రూపి చినోయ్ మాట్లాడుతూ, "మా కుటుంబ చరిత్ర మరియు మాల్టుతో అనుబంధం దేశంలోని చాలా సంస్థల కంటే ముందే ఉంది. ఇది సౌత్ సీస్ కు కేవలం వ్యాపారం కాదుబీ ఇది వేగం మరియు వ్యాప్తి కంటే సమయం మరియు సహనానికి ప్రాధాన్యతనిచ్చే విస్కీ తయారీకి హృదయపూర్వకమైన అన్వేషణ" అని అన్నారు. అదనంగా, ఢిల్లీ, ముంబై, హైదరాబాద్, బెంగుళూరు, గోవా మరియు చండీగఢ్ సహా భారతదేశం అంతటా డ్యూటీ-ఫ్రీ అవుట్లెట్లలో ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న రేర్ మరియు దువా (46%) యొక్క అధిక- ఏబివి వేరియంట్లను పరిచయం చేయడం ద్వారా అభిరుచి గల యాత్రికుల అవసరాలను తీర్చడానికి సౌత్ సీస్ ఒక అడుగు ముందుకు వేసింది. ఇవి %ఖాజు%లో రిటైల్ కోసం కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ ట్రావెల్-ఎక్స్క్లూజివ్ ఎడిషన్లు మహొన్నత , మరింత తీవ్రమైన సింగిల్ మాల్ట్ అనుభవాన్ని అందిస్తాయి. సౌత్ సీస్ డిస్టిలరీస్ డైరెక్టర్ హమావంద్ చినోయ్ మాట్లాడుతూ "మా డిస్టిలరీలో అత్యంత ప్రత్యేకమైన అంశం విస్తారమైన లిక్విడ్ లైబ్రరీ. అన్పీటెడ్ లేదా పీటెడ్ వెరైటీలను ఆస్వాదించే వినియోగదారుల కోసం లగ్జరీ సింగిల్ మాల్ట శ్రేణిని తీర్చిదిద్దడానికి మేము మా ప్రైవేట్ కలెక్షన్ యొక్క అరుదైన క్యాస్క్ల నుండి రేర్ మరియు దువా ని ఎంచుకున్నాము. ఈ రెండు రకాలు , ఎక్స్-బోర్బన్ మరియు ఎక్స్-షెర్రీ ఫస్ట్-ఫిల్ క్యాస్క్లో పరిపక్వం చెందాయి, వినియోగదా రులకు వారి ప్రత్యేక లక్షణం, నిజంగా ప్రత్యేకంగా నిలుస్తుంది.

**బియాండ్ సింగిల్ మాల్ట్స్ :** సిక్స్ బ్రదర్స్ మహురాసౌత్ సీస్ తన భండాగారంను విస్తరిస్తూ, సిక్స్ బ్రదర్స్ మహురాతో హెరిటేజ్ ఇండియన్ మహురా (మహువా) స్ఫూర్తిని పునరుద్ధరించింది, ఇది పూర్తిగా మహురా పువ్వులతో తయారు చేయబడింది మరియు క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ వలె అదే కాపర్ పాట్ స్టిల్స్ లో డిస్టిల్డ్ చేయబడింది. టెక్విలా, కాగ్నాక్ మరియు స్కాచ్ వంటి గ్లోబల్ స్పిరిట్స్లో చేరడానికి, సిక్స్ బ్రదర్స్ మహురా డిస్టిలరీ యొక్క మార్గదర్శక స్ఫూర్తికి ఉదాహరణ. మాల్ట్ పరిపక్వతలో నాలుగు దశాబ్దాల నైపుణ్యం మరియు సింగిల్ మాల్ట్ , మహురా కేటగిరీలలో కొనసాగుతున్న ఆవిష్కరణలతో, సౌత్ సీస్ డిస్టిలరీస్ భారతీయ స్పిరిట్స్ ను ప్రపంచవ్యాప్తంగా తీసుకువెళ్ళటానికి సిద్ధంగా ఉంది.

**ఉత్పత్తి విరాలు**

క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ రేర్ విభిన్న మార్కెట్ల అవసరాలను తీర్చటానికి రెండు ఫార్మాట్లలో అందుబాటులో ఉంది. భారతదేశంలో, ఇది 42.8% ఏబివి వద్ద 750 ఎంఎల్ సీసాలలో లభిస్తుంది, మహారాష్ట్ర, గోవా మరియు హర్యానా అంతటా రూ. 6,000 – రూ. 8,900 మధ్య ధరలో పంపిణీ చేయబడుతుంది. ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగుళూరు, గోవా మరియు చండీగఢ్లోని డ్యూటీ-ఫ్రీ అవుట్లెట్ల కోసం, ఇది 750 ఎంఎల్ బాటిళ్లలో 46% ఏబివి వద్ద అందించబడుతుంది, దీని ధర రూ. 8,000.క్రేజీ కాక్ సింగిల్ మాల్ట్ దువా రెండు విభిన్న వేరియంట్లతో 750 ఎంఎల్ బాటిళ్లలో కూడా అందుబాటులో ఉంది. భారతదేశంలో, మహారాష్ట్ర, హర్యానా మరియు గోవా అంతటా దువా 42.8% ఏబివితో అందించబడుతుంది, దీని ధర రూ. 8,000 – రూ. 12,500 మధ్య ఉంటుంది. డ్యూటీ ఫ్రీ దుకాణదారుల కోసం, విస్కీలు ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, బెంగుళూరు, గోవా మరియు చండీగఢ్లోని అవుట్లెట్లలో 46% ఏబివి , రూ. 11,800 నుండి లభిస్తాయి.

# విటమిన్ బి12 లోపిస్తే చాలా డేంజర్

మన శరీరానికి అత్యంత అవసరమైన పోషకాల్లో విటమిన్ బి12 ముఖ్యమైనది. దీనిని 'కోబాలమిన్' అని కూడా పిలుస్తారు. మనం ఆరోగ్యంగా ఉండడానికి సహాయపడే ఈ విటమిన్(బి12)లోపిస్తే, రక్తహీనత నుంచి మతిమరుపు వరకు, నరాల బలహీనత నుంచి డిప్రెషన్ వరకు మనల్ని ఎన్నో రకాలుగా ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా.. శాకాహారులు విటమిన్ బి12 విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఈ క్రమంలోనే విటమిన్ బి12 కోసం తీసుకోవాల్సిన ఆహారాలు ఏంటో ఈ స్టోరీలో చూద్దాం.

బి కాంప్లెక్స్ విటమిన్లు అన్నింటిలో బి12 చాలా ముఖ్యమైనదని, మెటబాలిజాన్ని నియంత్రించడానికీ, ఎర్రరక్తకణాల పనితీరు మెరుగుపరచడంలోనూ ఇది ప్రత్యేక పాత్ర పోషిస్తుందని ప్రముఖ పోషకాహార నిపుణులు డాక్టర్ లతాశశి చెబుతున్నారు. శాకాహారంలో బి12 చాలా తక్కువగా ఉంటుందని, సప్లిమెంట్లు తీసుకోవడం వల్ల కొంత మేలు జరుగుతుందని చెబుతున్నారు. అలాగే కొన్ని ఆహార పదార్థాల్లో కూడా విటమిన్ బి 12 ఉంటుందని, వాటిని డైట్లో చేర్చుకుంటే మంచిదంటున్నారు. అవేంటంటే,

పాల ఉత్పత్తులు : తగిన మొత్తంలో విటమిన్ బి12 పొందడానికి పాల సంబంధిత ఉత్పత్తులు మంచి ఎంపికగా చెబుతున్నారు డాక్టర్ లతాశశి. పాలు, జున్ను, పెరుగు, చీజ్ వంటి డెయిరీ ఉత్పత్తుల్లో ఈ విటమిన్ పుష్కలంగా లభిస్తుందంటున్నారు. కాబట్టి, మీ రోజువారీ ఆహారంలో వివిధ రకాల పాల ఉ త్పత్తులను చేర్చుకోవడం మంచిదంటున్నారు.

తృణధాన్యాలు : తృణధాన్యాలు బలవర్ధకమైన పోషకాలను అందించి శరీరానికి మేలు చేస్తాయనే విషయం తెలిసిందే. అయితే నాన్వెజ్ తినని వారు విటమిన్ బి12 సమృద్ధిగా పొందాలంటే తృణధాన్యాలను ఆహారంలో భాగం చేసుకోవాల్సిందే అంటున్నారు. ఒక కప్పు తృణధాన్యాలను ఉదయం అల్పాహారంగా




తీసుకోవాలని సూచిస్తున్నారు. ఓట్స్ ఫ్లేక్స్, కార్న్ఫ్లేక్స్ తీసుకోవటం మంచిదంటున్నారు.

పోషకాలున్న ఈస్ట్ : న్యూట్రిషనల్ ఈస్ట్లో కూడా విటమిన్ బి12 పుష్కలంగా ఉంటుందంటున్నారు. ఈ ఈస్ట్ ఒక చెంచాలో 5 ఎమ్సీజీ విటమిన్ బి12 ఉంటుందని చెబుతున్నారు. ఈస్ట్ను పాప్కార్న్, సూపులు, కూరలు, పాస్తాలలో కలుపుకుని తీసుకోవచ్చని సూచిస్తున్నారు. ఇవే కాకుండా బియ్యం, మొక్కజొన్న, ఓట్స్, సోయా, మల్టీగ్రెయిన్స్ లాంటి ఫోర్టిఫైడ్ ఆహారాన్నీ తీసుకోవాలని అంటున్నారు డాక్టర్ లతాశశి.

# సినిమా రివ్యూ




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన సినిమా 'గేమ్ చేంజర్'. శంకర్ దర్శకత్వం వహించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సంస్థలో 50వ చిత్రమిది. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. కమల్ హాసన్, శంకర్ కలయికలో 'ఇండియన్ 2' చేయాలనుకున్నారు దిల్ రాజు. అయితే, దాని బదులు 'గేమ్ చేంజర్' కుదిరింది. 'ఆర్ఆర్ఆర్' విజయం తర్వాత రామ్ చరణ్ హీరోగా నటించిన ఈ సినిమా ఎలా ఉంది? శంకర్ ఎలా తీశారు? సినిమాలో కథ, కథనాలు ఎలా ఉన్నాయి? అనేది చూస్తే...

**కథ :** రామ్ నందన్ (రామ్ చరణ్) ఐఏఎస్ అధికారి. విశాఖకు కలెక్టరుగా వస్తారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే అవినీతిపరులు, అక్రమార్కుల భరతం పడతాడు. రేషన్ బియ్యం – ఇసుక మాఫియాకు బుద్ధి చెప్పి మిగతా వాళ్లను దారిలో పెడతాడు. ఆ మాఫియా వెనుక ముఖ్యమంత్రి సత్యమూర్తి (శ్రీకాంత్) కుమారుడు బొబ్బిలి మోపిదేవి (ఎస్.జె. సూర్య) ఉంటాడు.
ఇసుక మాఫియా విషయంలో రామ్ నందన్, బొబ్బిలి మోపిదేవి మధ్య జరిగిన గొడవ – తదనంతర పరిణామాల వల్ల ఎన్నికల వరకు వెళ్లాల్సి వస్తుంది. రామ్ నందన్ పోలికలతో ఉన్న అప్పన్న (రామ్ చరణ్) ఎవరు? ఆయన మరణానికి కారకులు ఎవరు? అప్పన్న భార్య పార్వతి (అంజలి)ని చూసి ఏకంగా ముఖ్యమంత్రి ఎందుకు షాక్ అయ్యాడు? ఎన్నికల్లో ఏం జరిగింది? చివరకు ఏమైంది? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

**విశ్లేషణ :** 'ఇండియన్ 2' తర్వాత శంకర్ రచన, దర్శకత్వంలో పస తగ్గిందని కామెంట్స్ వినిపించాయి. ఆయనలో మిడాస్ టచ్ మిస్ అయ్యిందని విమర్శలు వచ్చాయి. రాజకీయ నేపథ్యంలో సందేశాత్మక కథలతో కమర్షియల్ సినిమా తీయడం తన స్పెషాలిటీ ఏమిటో 'గేమ్ చేంజర్'తో మరోసారి చూపించారు శంకర్. రామ్ చరణ్ లాంటి యాక్టింగ్ పవర్ హౌస్ ఉండటంతో ఆయన మార్క్ కొన్ని సన్నివేశాల్లో మరింత ఎలివేట్ అయ్యింది. పెన్ పవర్ కొంత తగ్గిన చోట యాక్టింగ్ పవర్ సినిమాను నిలబెట్టింది. అవినీతిపరుడైన మంత్రి, సీఎం కావాలని కలలు కనే ముఖ్యమంత్రి తనయుడిని ఒక కలెక్టర్ ఎలా కంట్రోల్ చేశాడు? అనేది క్లుప్తంగా 'గేమ్ చేంజర్' కథ. యువ తమిళ దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ అందించిన కథలో కమర్షియల్ సినిమాకు అవసరమైన హంగులు ఉన్నాయి. కానీ, కొత్తదనం లేదు. పొలిటికల్ డ్రామాలు, ఇంతకు ముందు శంకర్ తీసిన సినిమాలు చూసిన ప్రేక్షకులకు కథ కొత్తగా ఏమీ ఉండదు. కానీ, శంకర్ రేసీ స్క్రీన్ ప్లే ఆ లోటు తెలియనివ్వకుండా చేసింది. అలాగే కమర్షియల్ పంథాలో కథను పరుగులు పెట్టించారు. హీరో ఇంట్రడక్షన్, ఆ తర్వాత హీరో – విలన్ ఫేస్ ఆఫ్ సీన్స్ తీయడంలో తన అనుభవం చూపించారు. అయితే... రామ్ చరణ్, కియారా అద్వానీ ప్రేమలో పడే సన్నివేశాలను కొత్తగా రాసి, తీసి ఉంటే బావుండేది. రొటీన్ అనిపించాయి. క్లైమాక్స్ కూడా సినిమాకు కావాల్సిన హై ఇవ్వలేదు.
'గేమ్ చేంజర్'ను మెగా అభిమానిగా చూస్తే... మరీ ముఖ్యంగా జనసేన శ్రేణులకు నచ్చే అంశాలు ఉన్నాయి. బొబ్బిలి మోపిదేవి (సూర్య) క్యారెక్టర్ మీద వేసిన కొన్ని పంచ్ డైలాగ్స్ ప్రతిపక్ష పార్టీ శ్రేణులు నొచ్చుకునేలా ఉంటాయని చెప్పడంలో ఎటువంటి సందేహం అవసరం లేదు. 'డబ్బు లేని రాజకీయాలు చేయాలి' అని అప్పన్న పాత్ర చెప్పే, ఆ సిద్ధాంతాలు జనసేనను గుర్తు చేయడం మాత్రమే కాదు, జనసేనకు ప్లస్ అయ్యేలా ఉన్నాయి.
'గేమ్ చేంజర్' సినిమాలోని ప్రతి ఫ్రేములోనూ 'దిల్' రాజు – శిరీష్ ప్రొడక్షన్ వేల్యూస్ ఆశ్చర్యపరుస్తాయి. ఖర్చుకు అసలు ఏమాత్రం వెనుకాడలేదు. ముఖ్యంగా పాటల్లో భారీతనం కనబడుతుంది. శంకర్ మార్క్ సీన్లకు తమన్ అందించిన నేపథ్య సంగీతం కూడా బావుంది. ప్రతి పాట పిక్చరైజేషన్లో రిచ్నెస్ కనిపించింది. కెమెరా వర్క్ బావుంది. హీరో ఎలివేషన్స్ విషయంలో కెమెరా వర్క్ సూపర్బ్. క్రిస్పీ ఎడిటింగ్ సినిమాకు ప్లస్ అయ్యింది. రామ్ చరణ్ కెరీర్లో అప్పన్న క్యారెక్టర్ మరో మైలురాయిగా నిలుస్తుంది. నత్తి వల్ల ఇబ్బంది పడే సన్నివేశాల్లో అద్భుతమైన నటన కనబరిచారు. ఇక, రామ్ నందన్ పాత్రలో స్టైలిష్ లుక్స్ బావున్నాయి. రామ్ చరణ్ డ్యాన్స్ కూడా! అలవోకగా వేసిన కొన్ని స్టెప్స్ విజిల్స్ వేసేలా ఉన్నాయి. కియారా అద్వానీ అందంగా కనిపించారు. అయితే, నటన పరంగా అంజలి అదరగొట్టారు. తప్పెటగుళ్ళు కొట్టేటప్పుడు ఆమె ఎక్స్ప్రెషన్స్, ఆ లుక్స్ కొన్నాళ్ళు గుర్తుంటాయి. అంజలిని ఇంకొన్నాళ్లు నిలబెట్టే రోల్ ఇది.
నటుడిగా ఎస్.జె. సూర్య సూపర్ ఫామ్లో ఉన్నారు. అయితే, ఆయన నటన రొటీన్ అవుతుందని విమర్శలు ఉన్నాయి. కానీ, 'గేమ్ చేంజర్'లో కొత్త ఎస్.జె. సూర్య కనిపిస్తారు. లుక్స్ నుంచి నటన వరకు ప్రతి అంశంలో కొత్తదనం చూపించారు. శ్రీకాంత్ కూడా అంతే. రెండు లుక్కుల్లో ఆయన కనిపించారు. నటుడిగానూ ఆయన కొత్తగా కనిపించారు. జయరాం, సునీల్, వెన్నెల కిశోర్ నవ్వించే ప్రయత్నం చేశారు. కానీ, కుదరలేదు.
'గేమ్ చేంజర్'... పక్కా కమర్షియల్ అండ్ పొలిటికల్ ఫిల్మ్. స్టార్ హీరో నుంచి ఫ్యాన్స్ అండ్ ఆడియన్స్ ఆశించే అంశాలు అన్నీ ఉన్న సినిమా. కమర్షియల్ ఫార్మాటులో తీసినప్పటికీ... శంకర్ మార్క్ సీన్స్, రామ్ చరణ్ నటన, తమన్ సంగీతం విజిల్స్ వేయిస్తాయి. ఇంటర్వెల్ ట్విస్ట్ మామూలు షాక్ ఇవ్వలేదు. అదొక సర్ప్రైజ్ అయితే అప్పన్నగా రామ్ చరణ్ నటన సినిమాకు మరొక హైలైట్. పండక్కి హ్యాపీగా చూడొచ్చు. ఏపీ రాజకీయాలపై జనాల్లో అవగాహన ఉంటే సినిమాను ఎక్కువ రిలేట్ చేసుకుంటారు.

---

గత కొద్దిరోజులుగా మలయాళ సినిమా మార్కో గురించి తెలుగు సినిమా సర్కిల్స్ లో కూడా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. చిన్న సినిమాగా రిలీజ్ అయిన ఈ సినిమా 100 కోట్ల గ్రాస్ కలెక్షన్లు రాబట్టడంతో ఒక్కసారిగా అందరి చూపు ఆ సినిమా మీద పడింది. ఆసక్తికరంగా ఆ సినిమాని తెలుగులో కూడా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేశారు. రేపు జనవరి ఒకటి సందర్భంగా ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు. అయితే ఒకరోజు ముందుగానే ఈ సినిమాని ప్రేక్షకుల ముందుకు ఒక స్పెషల్ ప్రీమియర్ ద్వారా తీసుకువచ్చారు ఎన్వీఆర్ సినిమా నిర్మాతలు. అయితే ఉన్ని ముకుందన్ హీరోగా నటించిన ఈ సినిమా ఎలా ఉంది? తెలుగు ప్రేక్షకులకు ఎంతవరకు కనెక్ట్ అవుతుంది? అనే విషయాలు ఇప్పుడు మనం రివ్యూ లో చూద్దాం పదండి




**మార్కో కథ:**
సినిమా నేపథ్యం అంతా కొచ్చిన్ లో జరుగుతూ ఉంటుంది. పుట్టుకతో గుడ్డివాడైన విక్టర్(ఇషాన్ షౌకత్) దారుణమైన స్థితిలో హత్య చేయబడతాడు. కొచ్చిన్ లోనే ఒక పెద్ద బంగారపు డీలర్ అయిన జార్జ్(సిద్దిక్ అలీ) సోదరుడే ఈ విక్టర్. అతనికి సోదరుడైన మార్కో (ఉన్ని ముకుందన్) విక్టర్ మరణానికి కారణం ఏంటో తెలుసుకునే ప్రయత్నంలో పడతాడు. కుటుంబం కోసం ఏం చేయడానికైనా సిద్ధపడే మార్కో తన ప్రాణానికి ప్రాణమైన సోదరుడు ఎలా మరణించాడో కనుక్కోగలిగాడా? అసలు విక్టర్ ని చంపింది ఎవరు? ట్విట్టర్ని చంపిన వారిని మార్కో ఏం చేశాడు? అసలు చివరికి ఏం జరిగింది? లాంటి విషయాలు తెలియాలంటే సినిమాని బిగ్ స్క్రీన్ మీద చూడాల్సిందే.

**విశ్లేషణ:**
ఈ సినిమా ప్రారంభం ప్రేక్షకులలో కొంత ఆసక్తి రేకెత్తించే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఇద్దరు స్నేహితులు అందులో ఒకరు మరణించడం, మరొకరు హంతకుడిని గుర్తుపట్టడంతో ఆ హంతకుడు మరో స్నేహితుడిని చంపడంతో అసలు హీరో ఎంట్రీ ఎలా ఉంటుందా? అని అందరూ ఎదురు చూస్తున్న సమయంలో రొటీన్ ఫార్మాట్ లోకి వచ్చేస్తూ దర్శకుడు హీరో ఎంట్రీ ఆసక్తికరంగా ప్లాన్ చేసుకున్నాడు. హీరో ఎంట్రీ ఇచ్చిన తర్వాత ఇది కొత్త కథ ఏమీ కాదని ఈజీగా అర్థమయిపోతుంది. సోదరుడి చావుకు పగ తీర్చుకునేందుకు సిద్ధమైన హీరోకి ఎలాంటి అవాంతరాలు ఎదురయ్యాయి? చివరికి ఆ పగ తీర్చుకున్నాడా? లేదా? అనేది ఈ సినిమా కథ. నిజానికి ఇలాంటి కథలతో తెలుగులోనే కాదు దాదాపు అన్ని భాషలలో ఎప్పుడో పదుల సంఖ్యలో సినిమాలు వచ్చాయి. ఈ సినిమా కథ కూడా కొత్తది ఏమీ కాదు. కానీ సినిమాలో చెప్పుకోవాల్సింది కేవలం యాక్షన్ గురించి మాత్రమే. హీరో ఇంట్రడక్షన్ తర్వాత నుంచి హీరో చేసే ఫైట్లు యాక్షన్ ఎపిసోడ్స్ ఒక రేంజ్ లో హై ఇచ్చేలా డిజైన్ చేసుకున్నారు. సినిమా మొత్తం హీరో స్వాగ్, హీరో చేసే యాక్షన్ సీక్వెన్సులతోనే ప్రేక్షకులు ఎంగేజ్ చేసేలా రాసుకున్నాడు డైరెక్టర్. ఒక్కొక్క యాక్షన్ సీక్వెన్స్ చూస్తుంటే మైండ్ పోతుంది లోపల అన్నట్టుగా డిజైన్ చేసుకున్నారు. అయితే తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా కనెక్ట్ అయ్యే అవకాశాలు తక్కువే. ఎందుకంటే సాధారణంగానే మన వాళ్ళు సున్నిత మనస్కులు. అలాంటి వాళ్ళు ఇలాంటి సినిమాని సాధారణంగా జీర్ణించుకోవడం కష్టమే. అయితే యానిమల్, కిల్ వంటి సినిమాలు చూసినవారు, వాటిని ఎంజాయ్ చేసినవారు దీన్ని ఇంకా ఎంజాయ్ చేస్తారు. ఎందుకంటే ఈ సినిమా వాటికి బాప్ లాంటి సినిమా అన్నమాట. హీరో ఇంట్రడక్షన్ తర్వాత నుంచి హీరో క్యారెక్టర్ ను ఎస్టాబ్లిష్ చేసే ప్రయత్నం చేస్తారనుకుంటే ఆ విషయం జోలికి వెళ్లకుండా కేవలం హీరో చేత వందల మందిని, అతి జుగుప్సాకర రీతిలో చంపించడం మీదే దృష్టి పెట్టాడు డైరెక్టర్. అయినా సరే హీరో క్యారెక్టర్ కు ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. అతని బ్యాక్ స్టోరీ ఏమిటి అనే విషయాన్ని ఎస్టాబ్లిష్ చేయలేదు కానీ కుటుంబం కోసం దేనికైనా సిద్ధం అనే క్యారెక్టర్ కు సాధారణ ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు.
అయితే ఒక రకంగా బ్లడ్ బాత్ అనే పదానికి విజువల్ రూపంగా ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకువచ్చారేమో అనిపిస్తుంది. మలయాళంలో 100 కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టిన ఈ సినిమా తెలుగు ప్రేక్షకులను అలరించడం కూడా పెద్ద విషయం ఏమీ కాదు. సినిమా మొత్తాన్ని నడిపించింది యాక్షన్ బ్లాక్స్.. ఒక్కో యాక్షన్ బ్లాక్ కి మించి మరొక యాక్షన్ బ్లాక్ అనేలా డిజైన్ చేసుకున్నారు. హీరో యాక్షన్, స్వాగ్ తో సినిమా మొత్తాన్ని నడిపించారు. ఒక స్టైలిష్ యాక్షన్ కల్ట్ ఎంటర్టైనర్ గా ఈ సినిమాని అభివర్ణించవచ్చు. ఎందుకంటే ఇలాంటి స్థాయి వయలెన్స్ మన ఇండియన్ స్క్రీన్ మీద ఈ మధ్యకాలంలో చూడలేదు. ముందే చెప్పుకున్నట్టు యానిమల్, కిల్ లాంటి సినిమాలు చూస్తున్నప్పుడే చాలామందికి ఒళ్ళు గగుర్పాటు కలుగుతుంది. ఈ సినిమా చూసినప్పుడు అంతకుమించి అనే ఫీలింగ్ కలగడం ఖాయం.
నటీ నటుల విషయానికి వస్తే ఇప్పటికే మాలికాపురం అనే సినిమాతో అటు మలయాళం లో సూపర్ హిట్ అందుకున్న ఉన్ని ముకుందన్ తెలుగులో కూడా ఆ సినిమాని డబ్ చేసి రిలీజ్ చేశారు. కాకపోతే ఆశించిన మేర ఫలితం అయితే దక్కలేదు కానీ ఈ సినిమాతో మార్కో అనే పాత్రలో ఉన్ని ముకుందన్ పరకాయ ప్రవేశం చేసినట్టు అనిపించింది. తనదైన నటనతో యాక్షన్ తో స్వాగ్తో వన్ మాన్ షో నడిపించాడు ఉన్ని. ఆ తర్వాత సిద్దిక్, జగదీష్, అభిమన్యు తిలకన్, కబీర్ దుల్హన్ సింగ్ వంటి వాళ్లు తమదైన శైలిలో సినిమాని ఒక రేంజ్ లో నడిపించడంలో సక్సెస్ అయ్యారు. సినిమాలో ఈ పాత్రలు కనిపించిన ప్రతిసారి ఒక రకమైన కిక్ ప్రేక్షకులకు ఇవ్వడంలో సక్సెస్ అయ్యారు. రంగబలి సినిమాలో నటించిన యుక్తి తరేజ ఈ సినిమాలో నటించింది కానీ ఆమెకు పెద్దగా ప్రాధాన్యత ఉన్న పాత్ర అయితే కాదు. టెక్నికల్ అంశాల విషయానికి వస్తే ముందుగా దర్శకుడు ఫోకస్ ఎక్కువగా యాక్షన్ సీక్వెన్స్ మీదే ఉంది అనిపించింది. కొత్త కథ కాదు కొత్త స్క్రీన్ ప్లే కూడా కాదు. అయినా సరే ప్రేక్షకులను మొదటి నుంచి చివరి వరకు సీట్లకే అతుక్కుపోయేలా చేయడంలో ఆయన సక్సెస్ అయ్యాడు. కాకపోతే మితిమీరిన బ్లడ్ బాత్ మన ప్రేక్షకులకు ఎంతవరకు కనెక్ట్ అవుతుంది అనే విషయం మీద సినిమా కలెక్షన్స్ ఆధారపడి ఉంటాయి. సినిమా తెలుగు డైలాగ్స్ భలే సెట్ అయ్యాయి. అలాగే పాటలు గుర్తుంచుకో తగ్గట్టుగా లేకపోయినా బ్యాక్గ్రౌండ్ స్కోర్ మాత్రం ఒక రేంజ్ లో వర్కౌట్ అయింది. ఇక సినిమాను ఒక రేంజ్ కి తీసుకు వెళ్లడంలో బాగా సక్సెస్ అయింది ఈ బ్యాక్ గ్రౌండ్ స్కోర్. తెలుగు లిరిక్స్ కూడా ఆకట్టుకునేలా ఉన్నాయి.. యాక్షన్ డైరెక్టర్స్ ఎవరో కానీ వారికి వీరతాడు వేయాల్సిందే.. ఆ రేంజ్ లో యాక్షన్ పండించారు.

**ఫైనల్గా :**
మార్కో అన్లిమిటెడ్ బ్లడ్ బాత్ విత్ ఎంగేజింగ్ యాక్షన్.. కానీ సున్నిత మనస్కులకు కాదు సుమీ.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడుప్పగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com




# 12.1 .2025 నుంచి 18.1.2025 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

వారం ప్రారంభంలోమిత్రులతో సన్నిహితులతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడుపుతారు. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు. మిత్రుల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. వారము మధ్యలో గృహ వాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. వృత్తి పరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. యదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. వారం మధ్యలో వ్యక్తుల సహకారం పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు చేయడము లో చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభ శారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగుతాయి. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారుఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి..కుటుంబ ఆదాయంలో కొంత ఆటంకాలు ఉంటాయి, కన్ను మరియు పన్ను వంటిఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి. అవసరమైతే వైద్యుల్ని సంప్రదించాలి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. వ్యక్తిగత అంశములలో తీసుకొని నిర్ణయాలు ధైర్యంగాఉంటాయి



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

ప్రారంభం అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అబివృద్ధిని కలిగిస్తాయి. లో కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. ఆధ్యాత్మిక ఆలోచనలతో స్వాగతం పలుకుతారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. వారము మధ్యలో ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. ఆదాయం బాగుంటుంది, మాట విలువ పెరుగుతుంది.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

ప్రారంభం చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, వృత్తిలో ఆశించిన స్థానాన్ని పొందటానికి అధిక శ్రమ పడతారు. తగిన గుర్తింపు పొందుతారు. మనసులోని కోరికలు నెరవేరుతాయి. సంతోషంగాశుభవార్తలతోవృత్తి పరమైన అభివృద్ధితో, మొదలవుతుంది. తండ్రి,పెద్దలు నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుం టారు. వృత్తిలో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి.మధ్యలో వృత్తిపరంగా నూతన బాధ్యతలు ప్రయాణాలు, కొత్త వ్యక్తుల కలయిక, శ్రమ బడలిక ఉన్నప్పటికీ అధిగమిస్తారు



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో నూతన విషయాలు నేర్చుకుంటారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. భూమికి సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది.వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. తోబుట్టువులతో నిదానమవసరం. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు. వారం మధ్యలో ఒక వార్త ఘర్షణతో కూడిన ఆనందాన్నిస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. ఆత్మీయుల సహకారంతో కోరుకున్న విషయంలో పనులు ముందుకు సాగుతాయి. భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

వారం ప్రారంభంపెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధైర్యాన్ని ఇస్తుందివిద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. . విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి.అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవి సంతోషాన్ని , ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. మధ్యలో వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరమైన వైరాగ్యంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆకస్మిక లాభములు



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మబలముతో వాటిని జయిస్తారు.ఆరోగ్యం పై శ్రద్ధ అవసరము. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించటమేలు. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. వారం మధ్యలో భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్నిస్తుంది. వారం చివరిలో భాగస్వామ్య వ్యాపారాలలో అనుకూలంగా ఉంటుంది. జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి. కళా రంగంలో ఉండే వారికి అనుకూలంగా ఉంటుంద.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో కుటుంబము ఆహ్లాదకరంగా ఉంటుంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరోధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఆకస్మిక ఖర్చులు చికాకులు కలిగిస్తాయి. దీర్ఘకాలికి పెట్టుబడులు పైన ఆసక్తి ఉండదు. మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. చివరిలో తండ్రి సహకారము ఉంటుంది.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలోఅనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి.సంతానము తో, ఆత్మీయ వ్యక్తులతో ఆహ్లాదకరంగా గడుపుతారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. వారం మధ్యలో భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి.వాగ్వాదములకు దూరంగా ఉండాలి.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

ప్రారంభంసంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామి కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి.గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వరుణాలుచెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు.. రిసార్ట్స్ వంటి ప్రదేశాలకు వెళ్లడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారు.



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో తల్లి ఆరోగ్య ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబు ట్టువులకు నూతన అవకాశములు. మీ సహకారం ఉంటుంది వారికి వారం మధ్యలో స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. ఎంతోకాలం ఎదురుచూస్తున్న దూర ప్రదేశంలో అందుకున్న ఒక వార్త ఆనందాన్నిస్తుంది. విదేశీ ప్రయత్నాలు చేస్తారు.అధిక శ్రమ బాధ్యతలు ఉన్నప్పటికీ గుర్తింపు గౌరవాన్ని పెంచుకుంటారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి ప్రయత్నాలు అధికం చేస్తారు.


దివి వద్త్య